UNIVERSAL LIBRARY
OU_204217
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83.1 S96P Accession No. T1855.

Author [illegible]

Title [illegible] 1955.

This book should be returned on or before the date last marked below.

అన్ని హక్కులూ కవయిత్రివి

ప్రథమ ముద్రణము : 1955

★

ముప్పావలా

★

: ప్రతులకు :

శ్రీమతి పిల్లలమఱ్ఱి సుశీల

శారదా పీఠము : పట్టాభిపురము : గుంటూరు

# ప్రస్తావన

స్త్రీలకు విద్య అనవసర మనుకొన్న కాలములో కూడా వ్రాయటము, చదవటము, గణితము అవసర మనుకొనే వారు. కాని అది కేవలము చాకలి పద్దువరకే పరిమితమయి ఉండేది. ఆ కారణముచేత స్త్రీ కలము చేతపట్టి రచన చేయట మంటే, వానాకాలములో కోకిల కూజితము వినబడినట్లు ఉండేది. కాని ఇటీవల రచయిత్రుల సంఖ్య బహుళంగా పెరుగ నారంభించింది.

శ్రీమతి పిల్లలమర్రి సుశీల గారు పండిత కుటుంబములో జన్మించింది. ఈమె చేపట్టినది కూడా పండితునే. ఈమె సాహిత్యాభిరుచులతో జన్మించి- సాహిత్యాచార్యుడైన పెనిమిటి సాహచర్యమున వాటిని పెంపొందించుకొన్నది. గృహ జీవన మొక కళ. ఆ కళను కైవసము చేసుకోటానికి లలిత కళారాధన జరగాలి. ఈమె సంగీత సాహిత్యములలో ప్రవేశము కల్గించుకొన్న గృహిణి.

ఈమె రచించిన గ్రంథములో తన రేడియోప్రసంగా పత్రికలలో ప్రకటింపబడిన ఇతర రచనలను చేర్చినది. రాజాపుష్పాలు సౌరభభరితాలు. కమ్మని తావులను వెదజల్లుతున్నాయి. భర్తగారి జన్మదినమున వారికి సమర్పింపబడిన ఈ పుష్పాలు భక్త్యంజలికి అన్నివిధముల యోగ్యమైనవి.

ఆంధ్ర పాఠకలోకము ఈమె రచనలను ఆదరించి ప్రోత్స హించగలిగినచో ఇతోధికముగా కృషిచేసి సారస్వత వ్యాసంగములో మెరుగులను చూపించగలదని ఈ గ్రంథము స్పష్టపరుస్తున్నది.

ప్రతియేటా ఈ రచయిత్రి క్రొత్త క్రొత్త పూజా పుష్పాలను భర్తగారికి సమర్పింపగలదని ఆశిస్తున్నాను.

హైదరాబాదు,<br>7–2–1956.

ఇల్లిందల సరస్వతీ దేవి.

★

## అభిప్రాయం

వాస్తవికతతో కూడిన మీరచనోద్యోగం ప్రశంస నీయం.

బాపట్ల<br>6-1-1955

ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

★

# ఆశీరక్షతలు

శ్రీ రఘురామచంద్రుఁడు సుశీలను శ్రీ హనుమంతరాయునిన్
కూరిమి వారి సంతతిని కోర్కెల నెల్ల నొసంగి బ్రోచి యిం
పారెడు పద్యభారతిని బంధుర భావము లొప్పు నీమెకుం
చారు తరంబుగా నొసఁగి సాకుత యెల్లెడ నెల్లవేళలన్.

చి॥ సౌ॥ శ్రీమతియును శ్రీయుత పిల్లలమర్రి హనుమంతరాయకవి ధర్మపత్నియునగు సుశీల రచించి భర్తకు కృతి నొసంగిన పూజాపుష్పాలు అను చిన్న పొత్తమును నాకడకుఁ బంపగాఁ జదివితిని...

ఇందలి స్త్రీల బాధ్యత - పొదుపు అను రచనలోఁ జెప్పఁబడిన పద్ధతులు అందరు ఆచరించిన సంతోషమే....

విజయవాడ
గాంధీ నగరము
20-1-1956

గుడిపూడి ఇందుమతి దేవి

*

# కవయిత్రి

జననం 26–10–1926. వివాహం 21-4-1938.

సుప్రసిద్ధ పండితులూ, పరిశోధకులూ అయిన శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్య, ఎం. ఏ., గారి తనయ;

ప్రఖ్యాతాంధ్రోపన్యాసకులూ, కవి పండితులూ, అయిన శ్రీ పిల్లలమర్రి వేంకట హనుమంతరావు, ఎం. ఏ., గారి జాయ.

సంగీతశాస్త్రాభ్యాసంచేసి, ఫిడేలు, ఫ్లూటు కచ్చేరీలలో - హైదరాబాదులో - రజత పాత్రల బహూకృతిగా గొన్న విదుషి.

బహుగ్రంథ పారాయణంవల్ల సాహితీ సౌరభాలను నించుకొన్న సహృదయ.

ఆకాశవాణి ద్వారా, పత్రికా ముఖాన స్వీయ ప్రసంగాలను, రచనలను ప్రకటిస్తూ శ్రోతల, పాఠకుల మన్నన లందుకొంటున్న మహిళ.

ఈ 'పూజాపుష్పాల'ను కూర్చి పతి కర్పించిన సహధర్మచారిణి.

ఆదరించి, ప్రోత్సహించిన ఆకాశవాణి అధికారులకూ, పత్రికా సంపాదకులకూ కృతజ్ఞత.

★



శ్రీమతి పిల్లలమఱ్ఱి సుశీల

# సమర్పణము



ఉపన్యాసక శిరోమణులు, బహుగ్రంథ నిర్మాతలు

సాహిత్యాచార్య, ఆంధ్ర ఆర్నాల్డు బిరుదాంచితులు

**శ్రీ పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు, ఎం.ఏ.,**

గారి పరమ పవిత్ర చరణములపై

భక్తితో ఉంచిన పుష్పాలు

# పూజా పుష్పాలు

## ప్రసంగాలు

★


1. మన సంగీత సాహిత్యాలు 1

2. గొంతెమ్మ కోరికలు 7

3. గృహిణి బాధ్యతలు - పొదుపు 13

4. మహా లక్ష్మమ్మ కథ 19

5. శిల్పాధికారం - మహిళలస్థితి 28

6. మహాంధ్రం - విశ్వకల్యాణం 34


## కథానికలు

★


1. రాధ 37

2. జంటపూలు 46

3. గోపీ పశ్చాత్తాపము 55

4. దైన్యజీవి 58

5. "నాగతి యింతేనా ?" 61

6. పంపుదగ్గర గలాటా 65

# ౧

# మన సంగీత సాహిత్యాలు

"సంగీత మపి సాహిత్యం సరస్వత్యా స్తనద్వయమ్
ఏక మాపాతమధురం అన్యదాలోచనామృతమ్"

అన్నారు. సంగీతములో సాహిత్యమున్నది. సాహిత్యములో కూడా సంగీతమున్నది. సంగీత సాహిత్యాలు రెండూ అతి సన్నిహితాలు అయినట్లు తెలుస్తున్నది. ఛందస్సు వీటిని పదిలపరుస్తున్నది. కాని దేనికదే! సంగీతములోని స్వరకల్పన, శైలీ రీతులు వేరుగానే వుంటాయి. సాహిత్యములోని ఛందస్సు కల్పనలూ అసామాన్యాలు, అత్యద్భుతాలూను.

నాదము ప్రధానమై, జంత్ర గాత్రములయందు స్వర విన్యాసంచేత అవ్యక్త మధురమై, పిల్లలకూ, పెద్దలకూ, పండితులకూ ఆఖరికి పశుపక్ష్యాదులకు కూడా పారవశ్యము, ఆనందము, తన్మయత్వము కలిగించి ఐహిక, ఆముష్మిక సుఖదాయకమై ఒప్పేది సంగీతము. అంచేతే "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః" అన్నారు. ఒకటి నాద బ్రహ్మము, మరొకటి శబ్దబ్రహ్మము. భావరాగతాళములు సమ్మిళితాలై లయ ముఖ్యముగా పరిగణింపబడుతుంది.

ఇంక సాహిత్యము అంటే కవి మనస్సులోపుట్టేదీ, రస భావాల కనుకూలమైందీ, ఛందములలో కూర్చబడిందీ పద ములచేతా, యతిప్రాసలచేత వర్ధిల్లేదీ, సందేశాన్నిచ్చేదీ,

గద్యపద్యరూపములలో అవతరించేదీ సర్వ జనాకర్షకమైన శిల్పముతో ఉండి పండిత పామరులకు ఉల్లాసమూ, ఆనందమూ కల్గించేదీ. ఈ ఆనందము "నీటి కొలది తామరసుమ్మీ" లాగా పాఠకుల సహృదయాన్నిబట్టి ఉంటుంది. లలిత కళలలో హృదయ ద్రవీకరణశక్తి, రాగ రంజిత గుణమూ సంగీత సాహిత్యాలకే అధికంగా అమరిఉన్నవి. ఈ రెండింటి ఆశయమూ, పర్యవసానమూ ఒకటే అనవచ్చు. సంగీతోపాసనము వలన ఐహిక ఆముష్మికాలు సాధింపదగినట్లే- సాహిత్యోపాసనము వలనకూడా ప్రవృత్తినివృత్తులను రెంటినీ సాధింపవచ్చునని మనదర్శకుల విశ్వాసము. వాల్మీకి రామాయణం "పాఠ్యే గేయేచ మధురం" అన్నారు. అంటే అది సంగీత సాహిత్యాలను రెంటినీ అధికంగా కలిగి, ప్రమోద పరచునదని తాత్పర్యము. సంగీత సాధనమువలన పరమ భాగవతులైన త్యాగయ్యక్షేత్రయ్యలు ఎటువంటి పదమునూ ఖ్యాతినీ పొందారో, భారత భాగవత రామాయణాలు రచించి అంతటి స్థానాన్నీ, కీర్తినీ పొందారు, నన్నయ తిక్కన పోతనాది మహాకవులు.

రాజరాజ నరేంద్రుని ఆస్థానము నిరంతరము సంగీత సాహిత్యములచేత ప్రతిధ్వనించుతూ యుండేదని తెలుసుకుంటాము. భారతావతారికలో వైణికగాయకులు విద్యావిలాస గోష్ఠిలో ఉండడం కన్పిస్తుంది.

కాకతీయుల కాలంలో లలిత కళలు వర్ధిల్లాయి. ఆ కాలాన కొందరు కవులు సాహిత్యాన్ని మతప్రచారానికి ఉపయోగించుకొన్నారు; గీత ప్రబంధాలకు హెచ్చు ప్రాధాన్య

మిచ్చారు. అందుకనే పాడుకోవడానికి వీలైన న్ని ద్విపదలలో అవతరిల్లాయి ఆనాటివారి కొన్నికృతులు. బసవపురాణమైతే నేమి, పండితారాధ్య చరిత్ర అయితేనేమి, రంగనాథ రామాయణమైతేనేమి, ఇలాంటివే! రెడ్డిరాజులకాలములో అందులోనూ "కొమరిగిరి" పోషణలో సంగీత సాహిత్య స్వాతంత్ర్యాలుచ్ఛదశ నందుకొన్నట్లు చరిత్ర బోధిస్తుంది. శ్రీనాథ పోతనలవలన మన సాహిత్యములో శారదాదేవి ఎన్నెన్ని అలంకారాలు అందుకొన్నదో, అంతగానూ నాద సౌందర్య విభూషలనూ గ్రహించి మురిసింది!

ఇంక కృష్ణదేవరాయల ఆస్థానము కళా నిలయమే అనాలి. హంపీలోని, సప్తస్వరాలను పలికే స్తంభాలూ, తాళ్ళపాకవారి పదాలూ, పెద్దనాది కవుల ప్రబంధాలూ ఈ విషయాన్ని వేనోళ్ళ చాటుతున్నవి. ప్రతీ ప్రబంధ నాయికకూ సంగీత సాహిత్యాలలో మంచి ప్రావీణ్యమూ, చాతురీ ఉన్నట్లు చిత్రించారు మన ప్రబంధకారులు. పెద్దన్నగారు కూడా తమనాయికచేత వీణ మీటింపించారు. పరమ వైదికుడైన ప్రవరాఖ్యుడుకూడా ఆమె పాడుతూవుంటే ఈ ప్రపంచాన్నీ, తాను వచ్చిన పనినీకూడా మరచి గుడ్లప్పగించి చూచాడట. పాట అయిపోయిన తరువాతిగాని నోటపెంబడి మాటరాలేదుట అతగాడికి! నువ్వు ఎవరుఅని అతడు వివరాలు అడిగితే అక్కడకూడా "రహిబుట్ట జంత్ర గాత్రంబులు రాల్గరగించు విమల గాంధర్వంబు విద్యమాకు" అని చెప్పించారు పెద్దన్నగారు. ఇదివరకు నృత్యగీతాలు వెలయాండ్రకు నేర్ప

డము రాజసభలలో వీరు నాట్య, సంగీత చాతుర్యాలుచూపి మెప్పించటము ఎక్కువగా ఉండేవి. కాని ప్రాచీనకాలములో సంగీత సాహిత్యాలు పామరులకు అందుబాటులో ఉండేవి కావని తెలుస్తుంది.

వసుచరిత్రకారుడు, భట్టుమూర్తి తననుగురించి

"సను శ్రీరామ పదార వింద భజనానందుస్ జగత్ప్రాణసం
దన కారుణ్య కటాక్ష లబ్ధ కవితా ధారా సుధారాశి సం
జని తైకైక దిన ప్రబంధ ఘటికా సద్య శ్శతగ్రంథ క
ల్పను సంగీతకళారహస్యనిధి................"

అని చెప్పుకున్నాడు. నిజంగానే ఆయన వివిధ కళాపారీణుడే. సుప్రసిద్ధ వైణిక గాయకోత్తముడు ఆయన. సంగీత సాహిత్య సముద్రాలను రెంటినీ మధించినవాడు. ఏయే వాయిద్యాలను పలికిస్తే, ఏయే రీతుల హృదయంగమంగా వుంటుందో సంగీత శాస్త్రవేత్తగాని చెప్పలేడు. భట్టుమూర్తి అన్ని జంత్రముల పరిచయమున్నవాడుగా కన్పిస్తాడు. ముఖ్యంగా గొప్ప వైణి కుడు అనాలి.

"కాంభోజీమేళ విపంచికారవ సుధా పూరంబు" అన్నప్పుడు కాంభోజీ రాగ మిళితమైన విపంచికారవము యొక్క నాదము నాయికా శోకఘట్టానికి అనువుపడిందని గ్రహించి అది ఎంత మధురంగా ఉంటుందో మూర్తికవి తెలియజేశాడు. ఆయన వసుచరిత్ర సంగీత సాహిత్య రస ప్రవాహములకు రెండింటికీ సంగమస్థానమైన పుణ్యతీర్థము వంటిదై ప్రశస్తి వహిస్తున్నది.

ఇంక పింగళి సూరన్నగారి కలభాషిణి సంగీత సాహిత్యాలలో మేటి. కళా పూర్ణోదయములోని కథ ముఖ్యంగా సంగీతముపైన ఆధారపడించే! కలభాషిణి మణికంధరులు అత్యద్భుతమైన గాయకులు. వారికి గుణువు కేవలము మూర్తీభవించిన సంగీతమే అనదగిన నారదుడు!

మఱి నాయకరాజుల కాలంలో సంగీత సాహిత్యాలు పరాకోటిని అందుకొన్నవని చెప్పాలి. అందుకు ముఖ్యంగా రఘునాథనాయకుని సంగీత సాహిత్య కళాప్రతిభే కారణం. ఆయన స్వయంగా కవే కాక సంగీత కళాభిజ్ఞుడుకుడు. ప్రత్యేకంగా "వీణె"ను నిర్మించి "రఘునాథ మేళను" స్థాపించిన మహనీయుడు. ఆకాలం సాహిత్యంలో సంగీతానికి ఎక్కువ స్థానం ఉన్నట్లు కన్పిస్తుంది; యక్షగానం, కీర్తన లెక్కువగా కవులు వ్రాస్తూవచ్చారు. త్యాగరాజు-క్షేత్రయ లుద్భవించి పెట్టిన భిక్ష నిరుపమానమైనదిగదా!

త్యాగయ్య, క్షేత్రయ్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు, మొదలైన సుప్రసిద్ధ కవిగాయకులు సవ్యసాచులలాగా సంగీత సాహిత్యాల రెంటియందూ సర్వతోముఖ ప్రజ్ఞతో కృషిచేశారు. క్షేత్రయ్య పదములలో భక్తి శృంగారము లెక్కువగా కన్పిస్తాయి. కవి తాను గోపికయై శ్రీకృష్ణునికొఱకు తహతహలాడినాడు. జయదేవ పండితులు రాధాకృష్ణలీలను తన అష్టపదులలో పొందుపరచి ధన్యుడైనాడు. నారాయణతీర్థులు శ్రీకృష్ణలీలలను తన తరంగములలో వర్ణించినారు. రాజుల ఆస్థానాల కెక్కడ పోయినా ఊర్మిళాదేవి నిద్రా, లక్ష్మణదేవరనవ్వూ, బాలనాగమ్మ కథా,

బొబ్బిలి యుద్ధము వంటి జంగంకథలుగా, స్త్రీలపాటలలోని సరస సాహిత్యము కూడా జానపదుల జీవితములో పెనవేసు కొని వారికి ఉల్లాసము కలిగిస్తూనే వచ్చింది. పదకవిత ప్రాకృతుల్ని అత్యంతంగా అలవిస్తూనే వచ్చింది!

[4-11-1955 తేదీన ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి
నేను చేసిన ప్రసంగం]

★

# ౨

# గొంతెమ్మ కోరికలు

కళ అంటే ఆనందాన్నిచ్చేది. ఊహాసౌధాన్ని కల్పించేది. కదిలించేదీ, కరిగించేదీ, మురిపించేదీ, మరిపించేదీ! జీవితాన్ని ఆశామయంగా, భావింపజేసేది; కళ లేక బ్రతుకే వ్యర్థము. కళ దివ్యమైన వెలుగులాంటిది!

లోకంలో అరవైనాలుగు కళలున్నట్లు శాస్త్రజ్ఞులు చెబుతారు. సరసకళలనీ, చిత్రకళలనీ, లలితకళలనీ- కవిత్వమూ, చిత్రలేఖనమూ, నాట్యమూ, శిల్పమూ, సంగీతాల్ని పరిగణించడము అందరము ఎఱిగిందే! మానసిక అనుశీలనాన్ని బట్టి దేన్నయినా కళామయంగా రూపించవచ్చు. స్వతస్సిద్ధంగా లేనిదానిని కల్పించడములోనూ, రమణీయమైన ఊహాసౌధాన్ని చిత్రించడములోనూ ఉంది కళాస్ఫూర్తి. "That which is not nature" అని Arts పదానికి అర్థము చెబుతున్నప్పుడు మూల ప్రకృతికి భిన్నమయిందే కళ అని తెలుస్తుంది. ఈ నిర్వచనాన్ని బట్టి గొంతెమ్మ కోరికకూడా ఒక కళే సుమా! అనాల్సివస్తుంది. అభ్యంతరముందంటారా ?

అనగా అనగా ఒక గొంతి ఉన్నదిట. ఆమె తన కుమారులు ఏకచ్ఛత్రాధిపత్యము వహించాలని అభిలాషపడిందిట. ఆ అభిలాషలో స్వార్థముఎక్కువగా ఉందికపూ; కోరుకోడానికి అభ్యంతరమేమున్నది? అది మనస్సుకు సంబంధించింది. ఆ కోరిక ఈడేరటమూ, ఈడేరక పోవడమూ తరువాత సంగతి. అసాధ్యమైన కోరిక కోరిందాయెను! ఆ గొంతి కోరిక

విపరీతమైంది. పరిణామంలో ఫలితముకూడా ఆమె కోరికకు విరుద్ధమై, చివరకు అరణ్యాజ్ఞాతవాసాల్ని ఆమె కొడుకులకు ప్రసాదింపజేసింది. ఆ గొంతెమ్మ ఎవరో కాదు! భారతంలో కుంతీదేవే! దాన్నిబట్టే గొంతెమ్మ కోరిక "నానుడి" అయిపోయింది. అసాధ్యమైన కోరికా, కోరికకోరికగానే నిలిచిపోయే టటువంటిదే; ఊహకూ ఆలోచనకూ గమ్యమైనమయినదీ, భావవీధిలో ఉన్నంతవరకూ ఆనందాన్ని కలిగించేది అవుతున్నదికదూ గొంతెమ్మ కోరిక!

కళా ధర్మాలన్నీ గొంతెమ్మ కోరికకుకూడా చక్కగా అన్వయిస్తాయి.

ఒక ఊరిలో దేవశర్మ అనే బ్రాహ్మణుడు బీదతనంతో చాలా బాధపడుతూ కుచేల సంతానాన్ని ఈదలేక పోయేవాడు. ఆవూళ్లోనే ఒక ధనవంతుడు, తనకువున్న పీడలూ, బాధలూ పోగొట్టుకోవడానికి షోడశ మహాదానాలు చేస్తూవున్నాడు. ఆఖరిరోజు అన్నదానాలూ అయి, నూనెదానము సంగతి దేవశర్మకు తెలిసి "చచ్చేవాడి పెళ్ళికి వచ్చిందే కట్నము" అని అన్నట్టుగా నూనెదానము పుచ్చుకోవడానికి వెళ్ళాడట. కుండెడు నూనెపుచ్చుకొని ఒక అరుగుమీద కుండదించి, పై అంగవస్త్రం, చుట్టచుట్టి తలకిింద పెట్టుకుని పడుకొని ఇలా ఆలోచించ మొదలుపెట్టాడు: "ఈ నూనె అమ్మితే బోలెడంత లభిస్తుంది; ఆ సొమ్ముతో బట్టలూ, ఆవులూకూడా కొని, వాటితో వ్యాపారంచేసి, ఆ డబ్బుతో పెద్దభవనంకట్టి, ఆ భవనంలో నౌకర్లూ కాళ్ళు పిసుకుతూ వుంటే, ఆ కాళ్ళు పిసికే నౌఖర్ని ఇలా తంతాను." అని ఆ ఊహాసౌధాల పారవశ్యంలో,

ఆ కుండెడు నూనెనూ తన్నాడు. ఇంకేముంది ? కుండెడు నూనె ఒలికి పోవడమే కాక ఆనాటికి జీవనముకూడా కష్ట మయింది. ఇలాగే ఈ గొంతెమ్మ కోరికలు కోరుకొనే కాలంలో యితర చింతలూ, బాధలూ లేక మనస్సుకు ఆనందమిచ్చి తరువాత నవ్వులపాలుచేస్తాయి ! ఇక్కడ ఒక సూక్ష్మవిషయము గ్రహించాలి. సఫలముకానిదీ, కార్య రూపము దాల్చనిదీ, అవుతూ హాస్యరేఖకూడా కలిగి ఆలో చించినంతసేపూ ఆనందాన్ని కలిగించే విచిత్రమైన కళ అవు తున్నది కదూ గొంతెమ్మ కోరిక !

ఊహించే వారి సామర్థ్యాన్నిబట్టీ, కల్పనాశక్తినిబట్టీ ఈ గొంతెమ్మ కోరిక, అద్భుతమైన ఆకర్షణ, ఔత్సుక్యం ఉత్కంఠా కలిగి ఆనందాన్ని ప్రసాదిస్తుంది.

ఒకపేదరాలు కుమారుణ్ణికనగానే ఆశాహృదయంతో వివిధమైన ఊహాసౌధాల్ని నిర్మించుకోవచ్చు. "ఔనౌను, మాఅబ్బాయ్ పెద్దవాడౌతాడు. ఇంతచదువూ, సంధ్యలూ అబ్బుతాయి. నలుగురిలోను బుద్ధిమంతుడనిపించు కుంటాడు నా బంగారుతండ్రి; నా వరాలమూట గొప్ప ప్రయోజకుడు ఔతాడు; ఉన్నతోద్యోగి అవుతాడు; దివ్యసుందర భవనాన్ని నిర్మిస్తాడు. ఎందరెందరో నౌకర్లూ, చాకర్లూ, వాహన యోగం, నిత్యమూ ఆనందము తాండవిస్తూ, ఆనందమే జీవి తంగానూ, జీవితమే ఆనందముగానూ, ఉల్లాసంతో గడిపే కాలాన్ని సృజిస్తాడు మా పండునాయన !" ఇలా ఊహించే పేదరాలు, భవిష్యత్తులో ఆశకలిగి, బహుశా తీరనికోరికపట్ల

అభిలాష వెలిబుచ్చుకుంటూ తన దుస్థితినుండి తాత్కాలికంగా ఊరట చెందడంలేదూ!

ఈ ఊరటగానీ, తాపన్మాత్రం ఆనందంగానీ, ఎందులో వుంది? కోరికలోనే కదా! మనస్సు కల్పించుకున్న ఊహను పురస్కరించుకునే గదా! మనచేతుల్లో లేని భవిష్యత్తుపైన అధికారము కలిగిన వాళ్లమై, దాన్ని వ్యర్థంగా నిర్మించుకోవడము వల్లకూడా మనోహరమైన ఆనందం లభిస్తోంది.

ఒక ఎలెక్షను అభ్యర్థి, తాను మొదట కుతూహలంకొద్దీ దిగుతాడు. గెలుపే అతనిలక్ష్యం. తాను భావిస్తాడు – ఎన్నికలలో గెలుపొందినట్లూ, అనంతరం బాధువులూ, స్నేహితులూ మెడనిండా పూలదండలు వేసినట్లూ, టీపార్టీలు, సభలూ చేసినట్లూ, ఫోటోలు అనేకం అనేక పోజుల్లోతీసి వివిధ పత్రికలలో ప్రకటించినట్లూ, ప్రజలు సన్మానపత్రాలను సమర్పించినట్లు, వివిధమైన తమ వసతులకోసం ప్రజలు తండోపతండాలుగా తనను అర్థించడానికి వస్తూపోతూ ఉన్నట్లు, తన పలుకుబడికోసం పడిగాపులు పడుతూ ఉన్నట్లు, మంత్రివర్గంలో స్థానం తనకు లభించినట్లు, అనంతరం తాను దేశానికీ, ప్రాంతానికీ, అనేకమైన సంస్కరణాల్ని ప్రతిపాదించి సేవచేయుచున్నట్లూ ఊహిస్తాడు. ఇది గొంతెమ్మ కోరిక కావచ్చును!

ఈ గొంతెమ్మ కోరికకు స్థితిలేకపోవడంలో దీన్ని స్వప్నంతో పోల్చవచ్చు. స్వప్నవిశేషముకూడా విచిత్రమయినదే; స్వప్నంలాగానే గొంతెమ్మ కోరికకూడా మనస్సునాకర్షించే చిత్రాన్ని అందిస్తుంది. దానిలాగానే తాత్కా

లికమైన చైతన్యంకలది. స్వప్నంలో విచారముండవచ్చుకాని గొంతెమ్మకోరిక ఎప్పుడూ ఆనందంతోనమే ఉత్పాదిస్తుంది. కేవలం కల్పనాకథ అనవచ్చు. గొంతెమ్మకోరిక ఈ విధంగా భావిస్తే, కృత్రిమరత్నమే అవుతుంది. ఎప్పుడైతే కృత్రిమరత్నమన్నామో; పుట్టురత్నాలకున్న శోభ దానికి లేదనే బోధపడు తున్నదిగదా !

అసలు కోరికే మానసికసంబంధ విషయము. అంటే వాస్తవికస్థితి లేనట్టిది. గొంతెమ్మ కోరికలో ఒకఆశా, అనంత ఆకాంక్షా, బహుళంగా పెనవేసుకొని తాత్కాలికమైన అనిర్వచనీయమైన, ఆనందాన్ని ప్రసాదించే గుణముంది. సర్వసామాన్యంగా గొంతెమ్మ కోరికలన్నీ విఫలమవ్వనే! అది కల్పించుకున్న వారినే ఆనందపరుస్తుంది. వాటిని విన్నవారు మాత్రము గేలిచేయడము వాస్తవము. అన్నికళలలాగా సహృదయుల నందరినీ యిది ఆకర్షించనూలేదు. వారి ఆమోదము పొందనేరదూను. అందరికీ ఆనందాన్ని యివ్వజాలదు. కళాసృష్టికికలిగే రసస్ఫూర్తి ఎలాంటిదో అలాంటి ఆనందమే గొంతెమ్మకోరిక కోరేవారికికూడా కలుగుతుంది అని అనడములో అత్యుక్తి లేదు.

గొంతెమ్మకోరికను ఒక ఆలంకారిక చమత్కృతిగా గ్రహించవచ్చు. ఉత్ప్రేక్షలూ, అతిశయోక్తులూ, ఎన్నైనా యిందులో యిమిడి, మనోరంజకత్వానికి దోహదము చేస్తూ ఉంటాయి. ఎదుటివారు గేలిచేస్తున్నప్పటికీ, యీ గొంతెమ్మ కోరికలు వారినికూడా ఒకవిధంగా వినోదపరుస్తూనే ఉంటాయని మరచి పోగూడదు. కోరినవారిఊహలూ, కల్పనలోని రమ్య

తనుబట్టి ఆనందములభి స్తే, ఎదుటివారికి వారిప్రూహాలలోని అసందర్భమూ, అసంగతమూ, అసాధ్యమూ, హాస్య యుతమూఅయిన విశేషములు, మిక్కిలిగా చోద్యాన్ని కల్గించి మరోవిధంగా చక్కిలిగింత పెడతాయి. ఈ గొంతెమ్మ కోరికలే వదరుబోతునోట కోతలూ - డబ్బాలు - డంబాలూ, కొట్టించడానికి కారణ భూతాలవుతున్నాయని మనం గమ నించి తీరాలి. గాలిమేడల్లా, నీటిబుడగల్లా, గొంతెమ్మ కోరి కలు తాత్కాలికమైనప్పటికీ, ఈ విషయాన్ని మరపించి వ్రూహించేవారినీ, గేలిచేసేవారినీ, ఇరుపక్షాలవారినీ అలరింప జేయడమువల్ల యిదికళగాక మరేమవుతుంది గనుక? యదా ర్థము కానిది కళఅని తెలుసుకొనికూడా దానివల్ల మోసపోయి ఆనందాన్ని పొందినట్టే, సామాజికులు గొంతెమ్మ కోరికల ద్వారాకూడా వినోదాన్ని, వికాసాన్ని, ఉల్లాసాన్ని, ఉత్కం ఠనూ పొందుతూ ఉండడముచేత యిదిముమ్మాటికీ ఒకకళే-

[విజయవాడ ఆకాశవాణీ కేంద్రంనుంచి నేను చేసిన ప్రసంగం.]

★

# 3

# గృహిణీ బాధ్యతలు - పొదుపు

గృహనిర్వహణం ఒక ప్రత్యేక కళ అనే చెప్పాలి. గృహ యాజమాన్యంలో గృహిణి బాధ్యతే హెచ్చైనది. వచ్చే రాబడిని మించకుండా అర్హమైనవాటికే ఖర్చుపెట్టడంలోనూ, పొదుపుగా ధనాన్నివాడి, కొంత మిగల్చడంలోనూ గృహిణే బాధ్యత ముఖ్యంగా వహించాల్సివున్నది. అటు యజమానికి నచ్చచెప్పి, యిటు పిల్లలను అదుపులో పెట్టుకొని, యేమాత్రం లేవిడిగా కన్పించక లోకుల దృష్టిలో వెలితిపడకుండా వచ్చే రాబడిని మించకుండా గుట్టుగా కాపరం చేసే గృహిణి జీవితం ధన్యమైనదే అనిపించుకుంటుంది. ఉన్నవాళ్ళనుచూస్తే అసూయ, లేనివాళ్ళనుచూస్తే యెగతాళీ తప్ప యితరులు ఒకరికి చేసే సాయం యేమీలేదు. ఉన్నమ్మను చూచి లేనమ్మ వాతపెట్టుకో బూనుకోవడం కన్న బుద్ధితక్కువ వేరేమీ లేదు. దర్జాలకోసమనీ, ఘనతకోసమనీ తలకుమించిన ఖర్చుపెట్టడం — ముందుకురికి బోర్లపడడము తగనిపని. పరుగెత్తి పాలుత్రాగేకన్న, నిలబడి నీళ్ళుత్రాగడం మంచిది కదా.

ఇటీవలికాలంలో మన నాగరకతను పాశ్చాత్యదేశాలు దిద్దుతున్నవి. మనం భారతీయులమూ, మన వాతావరణము పాశ్చాత్యమూ కావడము గుర్తింపతగినది. మానవసంఘంలో హెచ్చుతగ్గులు ఆర్థికస్థితినిబట్టి నిర్ణీతమౌతూవున్నట్లు గమనిస్తాము. రానురాను సమాజంలో వ్యక్తిగౌరవం ధనంపైననే

ఆధారపడి వుండడంకూడా పాశ్చాత్య సాంప్రదాయాన్నిబట్టి వచ్చినవే. మన భారతసంప్రదాయం మాట మర్యాదలకూ, ఆతిథ్యానికి పుట్టినిల్లుకూడా.

పొదుపు అంటే, అనవసరమైన ఖర్చుచెయ్యకుండా వచ్చిన రాబడి జాగ్రత్తగా వాడి, కొంత మిగులుచుకోనడం. పొదుపుగా వుండేవారిని సంఘము పిసినిగొట్లులు అని అంటుంది. కాని, యెవరేమనుకుంటే మనకేం...? మనం జాగ్రత్తగావుంటే బాగుపడేవారము మనమేకదా. లోకులకేం? వచ్చేది తక్కువా – ఖర్చు రెండింతలుఅయితే యెట్లా...? పొదుపు సామాన్యంగా మధ్యతరగతి కుటుంబాలకే వర్తిస్తుంది యెక్కువగా. వచ్చేజీతం కొద్దీ, కుటుంబంలో పోషింపబడే వారు యెక్కువగా– సంపాదించేవారు ఒక్కరుగా వుంటారు. అటువంటప్పుడు జాగ్రత్తగా ఉండక తలకుమించిన ఖర్చుచేసి మనోవ్యథపాలవడం మంచిదికాదు. ఋణాలపాలై అపహాస్యానికీ బాధలకూ గురికావడం యేమిగొప్ప...? ఇంక విలాస వస్తువులకు పెట్టే ఖర్చు దుబారా అనాలి. టూతుపేస్టులు, బ్రష్షులు మానేసి – కచ్చికలతో ముఖం కడుక్కుంటే సరి పోతుంది. టిఫిన్ల బదులు ఊలూ, కాఫీబదులు పిల్లలకు చద్ది అన్నమూ పెట్టవచ్చు. బజారులలో చిరుతిండ్లకు బదులు యింటిలోచేస్తే యింటిల్లిపాతీ సుఖంగా తినవచ్చు. అది ఆదాకు ఆదా. ఆరోగ్యానికి ఆరోగ్యము. తల్లిదండ్రులవల్లనే పిల్లలుకూడా అన్ని వ్యసనములకు అలవాటుపడతారు. పిల్లలు గడిదాటితే మనకు మనస్తాపంతప్ప మరేమీ ఉండదు. పౌడర్లకు, స్నోలకూ ఖర్చుచేయడం అనవసరము. పువ్వులు

కొనడంకన్నా దొడ్లో పూలమొక్కలు వేసి, పెంచుకుంటే కళాత్మకదృష్టి అలవడుతుంది. పొదుపుగానూ వుంటుంది.

## మరి ఆహారవిషయం ఆలోచిద్దాం

కూరలు చవకఅయినప్పుడు విరివిగాకొని, వొరుగులు చేస్తే కూరలఖర్చు చాల తప్పించినవాళ్ళమవుతాం. దుంప కూరలు చవకప్పుడు కొనివుంచుకోవచ్చును. పంటలకాలం కనిపెట్టి అల్లాగే కందులు, పెసలు, మినుములూ, మిరప కాయలు ఏడాదికి సరిపడేవి కొనివుంచడం మేలు. కాఫీలు మానివేస్తే మనకు చాలాలాభము. కాఫీవల్ల అనారోగ్య ముతో బాధపడుతాము. దీనివల్ల చాలా యిళ్ళు గుల్లలవు తున్నవి. దొడ్లో కాళీస్థలంలో కాయగూరలు, దుంపకూరలు, ఆకుకూరలు వేసి, అట్లాగు కొంతధనం పొదుపుచేయవచ్చు.

## ఇక గుడ్డలు

వాయిలుగుడ్డలు, విదేశీ సిల్కు-చీరలు తళుకు బెళుకు లకుగాని రోజూ కట్టుకొని వాడలేము. మన్నిక ఉండవు. ధరలు చాలా ప్రియంగావుంటాయి. అంతఖరీదుపెట్టితే నేత చీరలు, పిల్లలకు నేతగుడ్డలు, ఖద్దరుగుడ్డలూ సంవత్సరానికి సరిపోయేవి వస్తాయి. నిజంగా ఆలోచిస్తే అవన్నీ దండగ. మనకూ మనబిడ్డలకూ మన్నికగలవిగా చవుకగావుండే వస్త్రాలు కొంటేనే నయం. ఈ గుడ్డలు కుట్టించడానికి కుట్టుకూలి రెట్టింపు అవుతుంది కాబట్టి తంటాలుపడి ఇంట్లోనే కుట్టుకోవడం మంచిది. ఈగుడ్డలకు చాకళ్ళు అనవసరము. వాళ్ళకు యిచ్చే జీతాలుకూడా దుబారాయే. పసిబిడ్డలు ఉంటే చాకళ్ళు

అవసరంకాని యెప్పుడూ అవసరంకాదు. మనకు వచ్చేరాబడి కాస్తేవస్తే, సిల్కు-చీరలు కట్టేవారినిచూచి మనం వాత పెట్టుకుని అటువంటివి కావాలని యింట్లో యజమానిచెవిలో పోరుపెట్టడంవల్ల వాళ్ళకూ కష్టమే. మనకూ కష్టమే. మనం మనతాహతుకు తగినట్లు ఉంటే బాగా ఉంటుందికాని మితి మీరి ఖర్చుచేస్తే మనకే హాని.

## పని పా ట లు

పనిపాటల విషయంలో మనం బరువు పనులు పనివారి చేత చేయించుకొని మిగతావి మనమే చేసుకోవచ్చు. ఒళ్లు వొంచి పనిచేసినందువల్ల శరీరానికి చాలా ఆరోగ్యము. అందుకనే తొత్తులాగా పనిచేసి దొరలాగా తినుమని సామెత వుంది. ఈ రోజులలో పనివారు సూదుల్లా వచ్చి దబ్బనాల్లా తేలడం నేర్చుకొన్నసంగతి అందరకీ అనుభవమే. పిల్లలను భయభక్తులుకల వారిగానూ, మాట మన్నించేవాళ్ళుగానూ, దుబారాఖర్చు చెయ్యకుండా ఉండేవాళ్ళుగానూ చెయ్యడంలో గృహిణి తన బాధ్యతను గుర్తించి వాళ్ళను అదుపులో పెట్టాలి. మనము యెట్లాతర్ఫీదుయిస్తే వాళ్ళు అట్లా తరిఫీదు అవుతారు. తీరిక సమయాల్లో గృహిణి చదువగల్గినదైతే గోళ్ళుగిల్లుకుంటూ కూర్చోక వాళ్ళకు చదువునేర్పాలి. మనం నేర్పినట్లు ట్యూటరు నేర్పుతాడా? శ్రద్ధ వాళ్ళకుంటుందా? లేకపోతే శ్రద్ధగాచదివించేటట్లు భర్తను పోరాలి. కాబట్టి మన పిల్లల స్వభావాలు మారి బాగుపడాలంటే గృహిణికి పొదుపు అవసరం.

మనము ప్రయాణాలు అతిశయముగా చెయ్యడంవల్ల గూడా ఖర్చు ఎక్కువే. అత్యావసరమయితేనే తప్ప మనము ప్రయాణాలు చేయరాదు. సినిమాలకు కూడా తరుచుపోరాదు. ఎందుకంటే సినిమాలవల్ల మనము నేర్చుకునేది లేకపోయినా అది వ్యసనమయి పోతున్నదని గమనించాలి. పిల్లలకు ఉపయోగకరములయిన సినిమాలు, మనకు విజ్ఞానదాయకములైనవి వస్తే అప్పుడప్పుడు చూడవచ్చును. లేకపోతే ఊరికే చాలా డబ్బు దండుగ అవుతుంది. సినిమాలు మానినందువల్ల కూడా మనము కొంత పొదుపుచేయవచ్చును.

వైద్యం:— చీటికీ మాటికీ డాక్టర్లకోసం పిలవనంపకుండా కొంత ఫస్టు ఎయిడ్ చేసుకోవచ్చును. అట్లా చేసుకోవడం చాల అవసరం. అసలు ఆహార విహారాలలో నియమాలను పాటిస్తూ జాగ్రత్త వహిస్తే డాక్టరు బిల్లులనుండి తప్పుకోవచ్చు.

ఇంటి అద్దెలు:— మనం వచ్చే జీతంలో ఇంటి అద్దెను కూడా భరించాలి. అన్ని వసతులుగా వుండాలి అని గృహిణి పట్టుపడితే మంచిదికాదు. ఎందుకనంటే వచ్చే రాబడికి మించి యింటి అద్దెలుపెడ్తే యెట్లా. ఉన్న కాస్తసలంలోనే బాగా వసతులను కల్పించుకొని తృప్తిపడటం గృహిణికి యెంతైనా అవసరం.

ఇక నగలు:— ఉన్నమ్మ బంగారంలో తళుక్కున మెరిస్తే మనకుకూడా అన్నీ లేకపోయెనని అసంతృప్తి పడడం చాలాతప్పు. ఎందువల్లనంటే మనం పొదుపుచేస్తేగాని మనకు నగలురావు. ఆమె ధనవంతురాలు – కాబట్టి వంటినిండా

బంగారు మయం అయే అవకాశాలు వున్నాయి. తలకుమించిన ఖర్చులకుపోయి ఆలోచనలకుపోయి, బురకు వేడెక్కించడం మనోవ్యథలతో మగ్గడంకన్న ఉన్నదానిలోనే తృప్తితో ఉండటం మెరుగు. కాబట్టి లేనిదానికోసం బాధపడి మనసులు పాడుచేసుకోక ఉన్నదానితోనే సంతృప్తిపడి, జాగ్రత్తగా ఉంటేనే మేలు.

కేవలం గృహిణి ఒక్కత్తే తంటాలుపడినా సంసారంలో పొదుపుగల్గుతుందనుకోరాదు. గృహిణి బాధ్యత యెరిగినదైనా, కలిసివచ్చే యజమానీ, పిల్లలూ ఉంటేనే అది సాగుతుంది. ఒకరు ఏటకిలాగితే, మరొకరు కోటికి లాగితే, అది చాలా కష్టం. అందుకనే 'కరణేషు మంత్రీ' అయి గృహిణి బాధ్యతవహించి, గృహనిర్వాహణములో పొదుపును సాధించి భూలోకస్వర్గంగా జీవితాన్ని రూపొందించుకోవడం యెంతైనా అవసరం అని గుర్తించాలి.

[8–4–'53 తేదీన ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి నేను చేసిన ప్రసంగం.]

★

౪

# మహాలక్ష్మమ్మ కథ

అనాదినుంచీ మనభారత దేశము వీరవనితలకు, పతివ్రత లకూ పుట్టినిల్లు అయింది. సీతా సావిత్రులవంటి సతీమతల్లుల నూ, ఝాన్సీ లక్ష్మీబాయివంటి వీర నారీమణులను కనిన దివ్యసీమ. అటువంటి చల్లనితల్లి కడుపున గాచిన నోముల పంట మహాలక్ష్మమ్మ. మహాలక్ష్మమ్మకథ ఒక జానపద గేయము. దీనినే లక్ష్మమ్మకథ అనికూడా అంటారు. స్త్రీకి భర్తకంటె వేరు దైవము లేదనీ, పుట్టినింటి సిరిసంపదలు, పుట్టింటి నివాసము కూడదనీ, స్త్రీలు ఆపదలలోనైనా ఉండెవలె భర్తవద్ద మెలగిన ఇటు పుట్టింటికీ, అటు అత్తింటికీ కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయని తన చరిత్రద్వారా తెలుపుతోంది. ఈకథ చదువుతున్నకొద్దీ కన్నీరు సానుభూతిగా రాలక మానవు. అటుభర్త ఇటు, అత్త ఆడుబిడ్డల తాకిడికీ, దౌష్ట్య నికీ బలిఅయి పోయిన యిల్లాలి విషాదగాథ మహాలక్ష్మమ్మ కథ. ఇటువంటివి వందలకొలది గాథలు కాలగర్భములో కలసి పోయినాయి.

ఉత్తర భూముల్లో దుగ్గి అనే వూరిలో ముసలప్పనా యుడు అనే మోతుబరి గారాబుకూతురు మహాలక్ష్మమ్మ. ఇంటిపేరు దిగుమర్తివారు. ఇద్దరుఅన్నదమ్ములకు గారాబు చెల్లెలు. పెద్దన్నగారు రామయ్య, రెండోవాడు కోటయ్య నాయుడు. ఆక్రిందటి జన్మలో నాగకన్యకగా జన్మమెత్తి శాపవశాత్తు నరజన్మ యెత్తింది మహాలక్ష్మమ్మ, దేవ నరప్ర

సాధ్యమైన ఆ బాలికను అల్లారుముద్దుగా పెంచు కుంటు న్నారు. ఆ తల్లితండ్రులూ – అన్నదమ్ములూ కూడా, ఈరీతిగా అల్లారుముద్దుగా పెరిగి, పెద్దదయి యవ్వనవంతు రాలైంది. బంగారు బొమ్మలాగావున్న తమ పుత్రికనుచూచి ఆనందిస్తూ ఒకనిమిషముకూడా ఎడబాయలేక పోయేవారు.

లింగాలపురములో సుబ్బయ్యనాయుడు, కోటయ్యనాయుడు, వెంకయ్యనాయుడూ అనే ముగ్గురన్నదమ్ములు, తల్లి వెంకమ్మా వున్నారు. పెద్దకోడలు సుభద్రమ్మ, రెండో కోడలు సుందరమ్మ, మూడో అతను వెంకయ్యనాయుడుకు వివాహముకాలేదు. దిగుమర్తి ముసలప్పనాయుడివద్ద కోడెల బేరానికి వెంకయ్యనాయుడు, ఆవూరి పెద్ద బ్రహ్మసాని రామానాయుడూ కలిసి ముసలప్పనాయుడింటికి వచ్చారు. ఆ సమయంలో సాక్షాత్తు లక్ష్మీదేవిలా మెరుస్తూన్న మహాలక్ష్మమ్మను చూసి వెంకయ్యనాయుడు పరవశమైపోయి వచ్చిన సంగతి మరచి వెనుకకుమరలి రామానాయుడుతో ఆమెను పెండ్లిఆడకపోతే నేను బ్రతికలేనని చెప్పి ముసలప్పనాయుడి వద్దకు రామానాయుడుతో కలసి వెళ్ళాడు. రామానాయుడు "మీలక్ష్మీదేవివంటి మహాలక్ష్మమ్మను వెంకయ్యనాయుడి కిచ్చి పెండ్లి చెయ్యమని" చెబుతాడు. వెంకయ్యనాయుడి చక్కదనం చూసి, ముసలప్పనాయుడు, పిల్లనియ్యాలన్న సంకల్పము ఉన్నప్పటికీ, "ఇతనికి యిద్దరు అన్నలువున్నారు కదా! చిన్నవాడైన యితనిమాటలు వారు వింటారోలేదో!" అని రామానాయుడిని ప్రశ్నిస్తాడు. రామానాయుడు "సుబ్బయ్య నాయుడు పనులు తొందరలో వున్నాడు కాబట్టి

మేమే వచ్చాములనీ, మీరు పిల్లనిచ్చేమాట యదార్థమైతే వారంతా వచ్చి శుభకార్యము సక్రమంగా నిర్వహిస్తారనీ" చెప్పుతాడు. అప్పుడు ముసలప్పనాయుడు "నాకు యిద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగివున్నాను. మాబిడ్డను చూడక క్షణమైనా తాళలేము. మీ వెంకయ్యనాయుడును ఇల్లరిక ముంచినట్లయితే వివాహము జరిపిద్దాము" అని చెప్పేస్తాడు. "వీరిద్దరికీ వ్రాసిపెట్టివున్నది కాబట్టి ఎవరిమూ తప్పించలేము." అని సుబ్బయ్యనాయుడుకి జాబు పంపుతారు.

ఆజాబుచూచి సుబ్బయ్యనాయుడు చాలా సంతోషించి అన్నిషరతులకీ ఒప్పుకొని మహావైభవముగా కళ్యాణము జరిపిస్తాడు. వివాహము సక్రమంగాముగిసినాక వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయినా చిరుమామిళ్ళవారు (మగపెండ్లివారు) వెళ్ళిపోవడానికి సిద్ధమౌతుండగా, సుబ్బయ్యనాయుడు తమ్ముడైన వెంకయ్యనాయుడిని దగ్గరకు తీసుకొని "ఇకనుండి నీకు తల్లి పేరమ్మగారు తండ్రి ముసలప్ప నాయుడుగారు. మాకన్న మీఅత్తమామలు నిన్ను చాలా గారాబంగా చూస్తారు. కాబట్టి లక్ష్మమ్మను ప్రాణముగా చూచుకుంటూ జాగ్రత్తగా మెసులుకొమ్మని" చెప్పి వెళ్ళిపోయినాడు. ఖజానాపెత్తనము, ఇంటిపెత్తనము యావత్తూ వెంకయ్యనాయుడి వశముచేసాడు ముసలప్పనాయుడు. తల్లి ఒకనాడు మహాలక్ష్మమ్మను పిలచి తల్లీ! నీవు తప్పకుండా తులసిని పూజచేసుకుంటూవుంటే సకలసంపదలూ, అయిదవతనానికి కొదువవుండదు" అనిచెప్పగా ఆమె అదేవిధంగా మహాభక్తితో ముప్పూటలు తులసీపూజను ఏమరకుండా చేస్తూవుంటుంది. మూడవదినము వారి

ఆచారము ప్రకారము కంకణాలువిప్పి దంపతులను ఏకము చేశారు. ఆనాటినుండి వెంకయ్యనాయుడి పంచప్రాణాలు మహాలక్ష్మమ్మే, "కాని పాపపుదైవము వారి యీసుఖము కూడా చూచి ఓర్చలేక పోయింది. క్రమంగా మహాలక్ష్మమ్మ గర్భముదాల్చింది ఆరోమాసము. వెంకయ్యనాయుడు, వేశ్యా సంపర్కమువల్ల మహాలక్ష్మమ్మను నిరాకరించడము ప్రారంభించాడు. అదివరదాకా ప్రాణముగా చూసుకునే భార్య యీనాడు విషమయింది. ఎప్పుడూ వేశ్యయింట్లోనే మకాము. యీచిచ్చును ఆమహాయిల్లాలు మనసులోనే అణిచింది. భార్యను చీడపురుగును చూచినట్లు చూడసాగాడు వెంకయ్య నాయుడు. తల్లికీ తండ్రికీ తెలియకుండా కుమిలి పోసాగింది అమె. నవమాసములు నిండిఆడపిల్లకలిగింది మహాలక్ష్మమ్మకు; పార్వతమ్మ అని నామకరణము చేసారు. ఒకనాడు ముస లప్పనాయుడు కూతురుతో "ఓలక్ష్మమ్మా! నీకుమార్తె పార్వ తిని రామయ్యనాయుడికియిస్తానని మాటయిన్నా"మనికోరాడు. భర్త తనతో మాట్లాడటములేదు, ఆయన మనస్సులో ఏమి వుందోనన్న ఆలోచన వున్నప్పటికీ– నవ్వుతూ "నీయిష్ట ప్రకా రమే జరిగిస్తాను." అని మాటయిస్తుంది, తండ్రికి. పార్వతికి రెండేండ్లు నిండినాయి. భర్తదర్శనమే అరుదయింది మహా లక్ష్మమ్మకు "ఏజన్మలో ఏతండ్రికీ, బిడ్డలకు ఎడబాటుచేశానో, ఏ భార్యాభర్తలకు ఎడబాపుచేశానో, యీనాడు నాకు యీ నాడు నాగతి యిలాఅయిందని" విచారించిందే కాని ఎవరినీ పల్లెత్తు మాటకూడా అనలేదా మహాయిల్లాలు.

ఒకనాడు ఎలాగైనా భర్త దర్శనము కావాలని మూల నక్కి భర్త భోజనము చెయ్యగానే నెమ్మదిగా ఎదురువెళ్ళి, భర్తకు నమస్కారముచేసి దనమీద భర్తి కెందు కంత ద్వేషమో తెలియచెయ్యమని పాదాలమీద పడ్డది. కాళ్ల మీద పడ్డ భార్యని ఒక తన్నుదన్ని వెళ్ళిపోయినాడు వెంకయ్యనాయుడు. బయటకువస్తూ "అయ్యో! ఎంత పనిచేసాను. యీ వార్త నాభార్య పోయి అన్నలతో, తండ్రితో చెప్తే నన్ను వారు ఏమి అవమానము చేస్తారో" అని అనుకుంటూ మళ్ళీ యింట్లోకి వెళ్ళి యింటి తాళముచేతులు, యినపపెట్టె తాళాలూ, అక్కడ పెట్టేసి కట్టుబట్టలతో, వస్తుంటూ వున్న భార్యను చెంపమీదకొట్టి వెళ్ళిపోతాడు లింగాల పురానికి వెంకయ్యనాయుడు.

తమ్ముణ్ని చూసి ఆశ్చర్యపోతాడు సుబ్బయ్యనాయుడు. తల్లి వెంకమ్మా, అక్క పిచ్చెమ్మా వెంకయ్యనుచూచి, చాలా సంతోషిస్తారు తమకొడుకేకాగా యింత ఘనకార్యము చేశాడని. అక్కడ నాకు ఏమీ స్వాతంత్రము లేకపోయినందు వల్ల వచ్చేశాను. అని చెప్తాడు ఇంట్లో. తెల్లవారగానే ముసలప్పనాయుడు ఇంట్లో తనఅల్లుడు లేకపోవడముచూచి కూతురుని అడుగుతాడు. ఆమె ఏమీచెప్పదు తండ్రి విచార పడుతాడని. రామయ్యనాయుడు, కోటయ్యనాయుడూ బయలు దేరి లింగాలపల్లె వెళ్లుతారు. అక్కడ తమ బావనుచూచి ఇంటికి రమ్మని బ్రతిమాలుతారు. ఎంత బ్రతిమాలినా వెంకయ్య పెడచెవిని పెడతాడు. అంతట ఆ అన్నదమ్ములు, మీ మరదలు అక్కడ అలమటించి పోతున్నది. ఆమెను

తీసుకు వెళ్లండి, అని చెప్పి దుర్గికి వెళ్ళిపోయినారు ఆ అన్న దమ్ములు. ఇంటికివచ్చి చెల్లెలుతో "అమ్మా! ఇప్పటితో మనకు నోటిమాటలు కండ్లచూపులు తీరిపోయినాయి. తొం దరగా ప్రయాణానికి సిద్ధముచేయి, అత్తవారింటిలో ఉండ వలసిన దానివి; నిన్ను ఇక్కడవుంచితే అపఖ్యాతిపాలు అవుతామ"ని అన్నారు. మహాలక్ష్మమ్మ కుమార్తె పాగ్య తమ్మను చంకనుఎత్తుకుని బయలుదేరుతూ, అన్న రామయ్యను చూచి "అన్నా! నాబిడ్డను నీవు వివాహముచేసుకుంటావని ఆశపడుతున్నాను, లేకపోతే, మనకు నోటిమాటలు కండ్ల చూపులు యిక వుండవు" అని కండ్లనీరు నించగా అన్నగారు సరేనని బాసచేస్తారు. అన్నపాదములకు నమస్కారాలుచేసి కళ్ళనీళ్ళతో వెళ్ళిపోతుంది లింగాలపురానికి మహాలక్ష్మమ్మ; అత్త వెంకమ్మా, ఆడుబిడ్డ పిచ్చెమ్మా తప్పితే, అంతా మహాలక్ష్మి వారింటికి వచ్చిందని సంతోషపడ్డారు. మహా లక్ష్మమ్మ బావగారితో "తులసికోటలేనిదే, తులసిపూజ చేయని దినము నాకు దుర్దినము కనుక కోట కట్టించమని బావ గారిని అడుగుతుంది. బావగారు సుబ్బయ్యనాయుడు సంతో షించి తులసికోట కట్టించడానికి పలుగువేసేసరికి అక్కడ లంకెబిందెలు బయలుపడతాయి.

"అమ్మా! నీతోపాటు లక్ష్మిని తీసుకునివచ్చినావు, నీ పవిత్రహస్తాలతో తియ్య"మని చెప్పి తీయిస్తాడు. నీకు దొరికింది కనుక అంతా నీదేనని చెప్పగానే మహాలక్ష్మమ్మ అందుకుని, నాకు నా తల్లిదండ్రులు తులలేని సొమ్ములు చేయించారు. ఇది మీరే వినియోగించమని చెప్పుతుంది,

లంకెబిందెలలోని వరహాలన్నీ పెట్టెలకు పోసి తాళము వేసి అత్తగారిచేతికి తాళములు యిస్తుంది. భర్త అనురాగము కన్న సొమ్ములు ఎక్కువ కాదని అభిప్రాయపడుతుంది. కాని తన సంసార మిట్లావున్నదని ఎవరికీ చెప్పక కృశించి పోసాగింది. శుక్రవారాలు ఒకపూట ఉపోసాలు చేస్తూ, తులసీ పూజలు ఎక్కువగా చేయసాగింది. చాటు మాటున పార్వతమ్మ చక్కదనము చూచిన పిచ్చెమ్మ, వెంకమ్మలు యిలా ఆలోచనలు సాగించారు. "మహాలక్ష్మమ్మ కూతురును పిచ్చెమ్మ కొడుకు యిచ్చి పెండ్లి చేస్తే ముసలప్పనాయుడి ఆస్తికి అతడే వారసుడౌతాడని ఆశపడి మహాలక్ష్మమ్మను అడగగా" ఆమె తన అన్నగారికి నిశ్చయమై పోయినట్లు చెపుతుంది. దానితో అత్తా ఆడుబిడ్డా మండిపడి నానా హింసలు పెట్టి, అన్నపానాలు లేకుండా పశువుల కొట్టంలో కట్టివేశారు. పార్వతమ్మను దగ్గర ఉంచుకొని కుమిలిపోయిందా మహాసాధ్వి. ఇట్లా లాభములేదని, ఒకనాటి పొద్దున వెంకయ్యవద్దకు పోయి "వెంకయ్యా, నీభార్య వేసే బోగము వేషాలు మేము చూడలేకుండా వున్నాము. మన పాలెగాడితో సరసాలు ఆడుతుందని" అంటిస్తారు. దానితో వెంకయ్య ఉగ్రుడై విదర్శనము లేనిదే నమ్మనంటాడు. సరే అట్లాగేనని, దాసీ వాడికి తలంటిపోసుకోమని చిన్న అంగవస్త్రముయిచ్చి మహాలక్ష్మమ్మను తలంటమంటారు. ఏమీ ఎఱుగని ఆ అమాయిక సరేననగా ఇక్కడ నలుగురు చూస్తారు, నీ పడకగదిలో అంటమని పంపుతారు,

వెంకయ్యవద్దకు వెళ్ళి "నాయనా! మీా ఆవిడ రంకు తనము కండ్లారా చూడ"మని తీసుకు పో యీా దృశ్యము చూపిస్తారు. అది చూడగానే బాకుతీసుకుని· మహాలక్ష్మమ్మ చెప్పేది వినకుండానే పొడిచేస్తాడు. తల్లి దండ్రులను, అన్న దమ్ములనూ తలుచుకొని దుఃఖిస్తూ గిలగిలా తన్నుకుంటుంది మహాలక్ష్మమ్మ. పార్వతమ్మ యిదిచూచి మూర్ఛపోతుంది. పొడువగానే వెంకయ్యకు కండ్లుపోతాయి. యింతలో అత్తగారు ఒక పెద్ద గడ్డపార తెచ్చి మహాలక్ష్మమ్మ గొంతుమీాద పొడు స్తుంది. నాపిల్లను చూపమని బ్రతిమాలుతుంది ఆ కటికవాళ్ళ ఆఖరిసారిగా, కండ్లుపోయి తడవులాడుకునే భర్తకు దండము పెట్టి అతని తనచేతిని తాకగానే తిరుగా కండ్లు వస్తాయి వెంకయ్యకు విచిత్రంగా, మహాలక్ష్మమ్మ యీారీతిగా ప్రాణము విడుస్తుంది. సుబ్బయ్యనాయుడు నిద్రపోతూవుండగా కలలో తనను చంపినవిధమంతా చెప్పి దహనక్రియలు జరిపించ మంటుంది లక్ష్మమ్మ. తెల్లవారగానే మైనపుబిళ్ళ బాకుపోటు తగిలినచోట అతికించి పాముకరిచింది చనిపోయిందని ప్రచా రము చేస్తారు అత్తా ఆడుబిడ్డలు. దహనము అక్కర లేదన గానే, గణచారికి ఆవేశమువచ్చి, నాకు పాముకరవలేదు, నాభర్త నన్ను చంపారు కాబట్టి ఆయనకు ఏమీా హాని కలిగించవద్దని," చెప్పుతుంది. మంచిగంధపు చెక్కలమీాద పసుపు కుంకుమలతో దహనక్రియలు చేయిస్తారు. మహా లక్ష్మమ్మ కూతురైన పార్వతమ్మను రామయ్యనాయుడుకి యిచ్చి వివాహముచేస్తారు.

చనిపోయే టప్పుడు ఏరూపులో వున్న అదే రూపములో దేవతై వెలసి, నూటొక్క గుడులలో కుంకుమపూజలు ఇప్పటికీ అందుకుంటోంది మహాలక్ష్మమ్మ. ఈరీతిగా భర్తా, అత్తా, ఆడుబిడ్డల దారుణ హత్యకు బలిఅయిపోయిన విషాద గాథ మహాలక్ష్మమ్మ కథ. మహాలక్ష్మమ్మ భారత నారీమణు లకు ఒక ఆదర్శము.

[7-5-1955 తేదీన విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారితం]

★

౫

# శిల్పాధికారం - మహిళల స్థితి

శిల్పాధికారం తమిళ భాషలో ఉత్తమ గ్రంథాలలో ఒకటి. ఇదీ "మణిమేఖలా" యనునదీ సమ కాలీనాలు. వీనిని తమిళంలో కవలమహాకావ్యాలు అంటారు. రెండింటికినీ అత్యంతమైన సన్నిహితసంబంధం ఉన్నది. రెండూ "సంగం" వాఙ్మయానికి చెందినవి. రెండును స్నేహితుల రచనలు. శిల్పాధికారమునందలి అనంతరకథ మణిమేఖలలో ఉన్నది. రెండూ లోకవృత్తము ఇతివృత్తముగా కలవి. చారిత్రికంగా రెండున్ను ప్రాముఖ్యముగలవే. శిల్పాధికారకర్త "ఇలంకో అడిగళ్". ఇలంకో అంటే రాజకుమారుడు. అడిగళ్ అంటే సన్యాసి. ఇతడు రాజకుమారుడుగా జన్మించి సన్యాసం తీసికొన్నాడు. ఇతన్ని మన వేమనతో పోల్చవచ్చును. వేమన్నవలె వేదాంతి అయినా ఇతను కథద్వారా నీతినిబోధించాడు. మణిమేఖల కర్త "సాత్తనార్" మొదట యావత్కథనూ "ఇలంకో" వ్రాయవలెనని అనుకొన్నాడు. కాని "ఇలంకో" తన మిత్రుడగు "సాత్తనార్" మణిమేఖల వ్రాసెనని విని, తాను పూర్వకథను వ్రాశాడు. ఇలంకో అడిగళ్ సన్యసించుటకు ఒక కథ చెబుతారు. చేర దేశాధీశ్వరునికి కలిగిన ఇద్దరు బిడ్డలలో, సెంగుత్తవన్" జేష్ఠుడు "ఇలంకో" రెండవవాడు. తండ్రివద్ద కొకనాడు ఒక జ్యోతిష్కుడొచ్చి "సెంగుత్తవన్"తో తండ్రి త్వరలో చావనున్నట్లు, చిన్నవాడగు "ఇలంకో" రాజు కానున్నవాడని చెప్పాడట. పెద్దవాడగు "సెంగుత్తవన్" ఇది విని తమ్ముని చంప ప్రయత్నించాడట. ఆ సంగతి "ఇలంకో" తెలుసుకొని

తాను సన్యసించి అన్నకు అస్థానాసని వాగ్దానంచేశాడట్ట. తరువాత "ఇలంకో" పట్టణంవిడచి లోకసంచారంచేసి, అనుభవాన్ని గడించి, శిల్పాధికార కావ్యాన్ని రచించాడు. ఈ గ్రంధం ఆనాటి రాజకీయ సాంఘిక పరిస్థితులు తెలుసు కోడానికి మిక్కి లి ఉపకరిస్తున్నది.

ఇది, మణిమేఖలా క్రీ॥ శ॥ రెండవ శతాబ్దిలో వెలువడిన గ్రంధాలు. అప్పుడు బౌద్ధ జైన మతాలు అత్యంత ప్రచారములోనున్నవి. మణిమేఖలలో బౌద్ధ నిర్వచనం ఎక్కువగా ఉంది. అందులో కథానాయికయగు మాధవి బౌద్ధ భిక్షునైపోయింది. ఈ రెండింటిలోని కథలు తమిళులకు అత్యంత ప్రీతికరాలు. శిల్పాధికారమున కథానాయకుడు "కోవలన్", కథానాయకి కణ్ణకి. ఈ కథ సినిమాకూడా వచ్చింది.

కథ కొద్దిగా చెబుతాను. కోవలన్ ఒక గొప్పధనికుడైన వర్తకుని కుమారుడు. ఇతని చక్కదనాన్ని ధనాన్నీ చూచి సౌందర్యవతియైన కణ్ణకిని వివాహంచేశారు. కోవలన్ ధనికులతో తిరుగుతున్న కాలంలో మాధవియను నొక చక్కని వేశ్య అతని కంటబడెను. వయసు వాడగు కోవలన్ దాని వలలో చిక్కుకొని. భార్యనువద్దలి ఆమెతో నున్నాడు. చివరికి ధనమంతా కోల్పోయినాడు. ఆఖరికి బుద్ధివచ్చి భార్య వద్దకు వచ్చాడు. మహాసాధ్వియైన కణ్ణకి తన ఆభరణములన్నీ భర్తకిచ్చి, వర్తకముచేయుమని ప్రోత్సహిస్తుంది. అతనితో తనుకూడా జీవించడానికి యిష్టపడుతుంది. పువ్వులమ్మిన

-చోట కట్టెలమ్మలేక స్వంతపట్టణమైన కావేరీ పట్టణంవదలి వర్తకం నిమిత్తమై మధుర చేరారు. కోవలన్ వర్తకానికి ధనము కావలసి కణ్ణకి యిచ్చిన ఆభరణములలోనుండి ఒక పాదాభరణం అమ్మటానికి అంగడికెళ్ళాడు. ఆ సమయానికే ఆ పూరి రాజు నింటిలో దొంగతనంజరిగింది. కోవలన్ -చోరుడని భ్రమించి రాజభటులతన్నితీసుకుపోగా రాజు బాగా విచారింపకుండానే అతనికి ఉరిశిక్ష విధించాడు. ఆ పిడుగువార్త కణ్ణకి విని తను ప్రాణత్యాగాన్ని చేసుకో తలపోసికూడా, తన భర్త నిర్దోషి యని రుజువుచేయడము తన ధర్మ మనుకొని రాజుదగ్గరకుపోయి తన భర్త నిర్దోషిత్వమును చాటింది. రాజు తన తప్పును తెలుసుకొని గుండెపగిలి చనిపోయినాడు. కణ్ణకికి కోపమాగక పట్టణం భస్మమైపోయేటట్లు శపించింది. వెంటనే పట్టణం భస్మమైపోయింది. తరువాత కణ్ణకి తాపసియై కాలము వెళ్ళబుచ్చింది. ఇదే సంగ్రహంగా కథ. కణ్ణకికి గుడి కూడా కట్టించి నారు.

ఈ గ్రంథములో ఆ కాలపు రాజకీయ సాంఘిక పరిస్థితులు వివరంగా ఉన్నాయి. ఆకాలపు సాంఘిక పరిస్థితులు గమనిస్తే అప్పటి సంఘం చాలా హీనావస్థతో ఉన్నట్టు తెలుస్తుంది. ప్రజలు భోగ లాలసులై యుండేవారు. లలిత కళలకు ఎక్కువగా ప్రాముఖ్యమిచ్చేవారు. ప్రతి కాలములో, ప్రతి సంఘంలో, స్త్రీ, పురుషులలో మంచివారూ, చెడ్డవారూ ఉంటూనే ఉంటారు. వేశ్యలు ధనమూ, పలుకుబడి, కలిగి రూపమూ, కలవారిని చెడగొడుతూ ఉండేవారు. ఆరోజులలో వ్యాపార వర్తకాలు విరివిగా సాగుతూ ఉండేవి.

కోవలన్ తండ్రి ఒక గొప్ప ఓడ వర్తకుడు. కావేరీ పట్టణపు సముద్రతీరంనుండి గొప్ప విదేశ వ్యాపారము సాగుతూండేది. ఆకాలంలో గొప్ప కవులుకూడా వున్నారు. తమిళ వాఙ్మయంలో, ఆకాలమున "సంగం" సాహితి వ్యాపించివుండేది. దక్షిణదేశ రాజ్యముల పరస్పర సంబంధము కూడా ఈ కావ్యంలో ఉన్నది.

ఇక మహిళల స్థితి :- ఇప్పటివలెనే ధనికులు పల్లెల్ని విడచి పట్టణాలు చేరుతూ ఉండేవారు. పల్లెలలో జానపదులు నివసించేవారు. పట్టణంలో స్త్రీలు భోగ లాలసలై ఉండిరి. స్త్రీలకు అంతఃపుర వాసము లేకుండేది. బహిరంగంగా పురుషులతో సంచరిస్తూ ఉండేవారు. వేశ్యలే కాక ఘరానా స్త్రీలుకూడా నాట్యప్రదర్శనాలలో పాల్గొంటూ ఉండేవారు. నాలుగు వర్ణాలవారూ విడివిడిగా నివసించేవారు. దేవాలయములకు, చెరువులకూ, తీర్థాలకు ధారాళంగా వెళ్ళేవారు. బౌద్ధ జైన మత ప్రభావాలచే కొంతమంది స్త్రీలు సన్యాసం పుచ్చుకునేవారు. దానికి కన్నకి నిదర్శనము. స్త్రీలు స్వయముగా భర్తను వరించేవారు. అప్పటి స్త్రీలు రత్నములతో పొదుగబడిన ఆభరణాలు ధరించేవారు. సన్నని విలువగల బట్టలు కట్టుకునే వారట. ఆకాలంలో మనదేశము చాలా సన్నని బట్టల నేతకు ప్రసిద్ధికెక్కినది. అలంకరణవిషయములో చాలా శ్రద్ధవహించేవారు. ఈ అలంకరణ వారివారి తాహతును బట్టి యుండేది. చీరలకు రకరకాల అంచులు వాడేవారు. పాము కుబుసాలకు, బట్టలకు పోల్చేవారు. వాటి సన్నతనాన్ని కవి పొగతో పోల్చాడు. బట్ట లెక్కువగా నూలుతోనే నేయు

బడేవి. నూలు సామాన్యంగా ప్రతియింటా స్త్రీలు వడికే వారు. పట్టు, ఉన్ని వస్త్రములు వుండేవి. ఎలుక వెంట్రుకలతో బట్టలు నేసేవారని శిల్పాధికారంలో ఉన్నది. స్త్రీలు తమ తీరిక కాలమున, నూలు వడుకటంలోనే గడిపేవారు. నగలు బంగారముతో చేసినవేగాక, ముత్యములు మొదలైన యితర రత్నములతో చేయబడుతూ ఉండేవి. పూలను వారు తల లోనే కాక మెడలోకూడా వేసుకునేవారట. రక రకాల ముడులు, జడలు అమలులో ఉండేవి.

పట్టణంలో వేశ్యలూ, సంసార స్త్రీలూ వేరు వేరుగా నివసించేవారు. యువకులైన పురుషులీ వాడలలో తిరుగుతూ ఉండేవారు. అట్లాంటి యువకులు వారి భార్యల్ని వదలి వేశ్యల్ని చేపట్టేవారు. ఇందుకు కథానాయకుడు కోవలన్ నిదర్శనము. అటువంటి భర్తల్ని తమ వైపుకు ఆకర్షించు కోడానికి వారి భార్యలు చాలా కష్టాలకు పాల్పడేవారు. ఇందుకు నిదర్శనము కణ్ణకి. కోవలన్‌ను మన పాండురంగ మాహాత్మ్యములోని నిగమ శర్మతో పోల్చవచ్చును. వేశ్యలు బాగా అలంకరించుకొని ధనికుల్ని వశపరుచుకోడానికి వారుండే వీథుల్లో తిరుగుతూ ఉండేవారు. కాని సంసార స్త్రీలకే గౌరవ ప్రతిష్టలు లభిస్తూ వుండేది. ఈరీతిగా కణ్ణకి తమిళ స్త్రీలకేగాక భారత స్త్రీలకు కూడా ఆదర్శ మహిళ.

వర్ణనలలో, స్త్రీలను వర్ణించుటలోకూడా వారు ఆంధ్ర ప్రబంధకవులవలెనే వర్ణించారు. పట్టణాలు, పల్లెలూ చాలా బాగా కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. పల్లెలలోకూడా, వేర్వేరు

జాతులవారు వేర్వేరుగా నివసించేవారు. బ్రాహ్మణుల వర్ణన చదివినప్పుడు మన చరిత్రలోని ప్రవరా సోమిదేవమ్మలు జ్ఞాపకాని కొస్తారు. రైతుల నిత్యజీవితాలుకూడా బాగా చిత్రించబడ్డాయి. పల్లెలలోకూడా నాటకశాలలున్నట్లు స్త్రీలూ, పురుషులూ వేషాలు వేశేవారనీ ఉన్నది. స్త్రీలూ పురుషులూ ఆయా ఋతువులలో పూచిన పూలతో అలంకరించుకొని, ఆయా ఋతువులకు తగినట్లు నృత్యాలు చేసేవారు. వివాహాలు కొన్ని బహిరంగంగానూ, కొన్ని రహస్యంగాను జరిగేవి. వయస్సు వచ్చిన స్త్రీ పురుషులు కలియుట, అట్లు కొంతకాలము జరిగిన తర్వాత తల్లిదండ్రులు తెలుసుకొని వివాహములు చేసేవారటకూడా. ఇప్పటికీ యీ పద్ధతి కోయంబత్తూరు, తిరువనంతపురము మొదలైన కొన్నిచోట్ల, కొన్ని తెగలవారికి ఉన్నది. కాబట్టి ఆరోజులలో స్వయంవరాలు ఉండేవని చెప్పవచ్చును. ఈ స్వయంవరం బ్రాహ్మణులలో ఉన్నట్లు కనిపించదు. ఆకాలపు వ్యావహ్కులు రెండు. ఒకటి "అహం" అంటే స్త్రీ పురుషుల ప్రేమ. రెండవది "పురం" అంటే యుద్ధము. ఈ మహా కావ్యకాలములోకూడా ఈ రెండింటికే అత్యంత ప్రాధాన్యమున్నట్లు కనబడుతుంది.

★

# ౬

# మహాంధ్రం - విశ్వకళ్యాణం

ప్రపంచ చరిత్రలో అనేకయుద్ధాలు జరిగినవి. వాని వల్ల అశాంతి రేకెత్తింది. జీవహింస భావహింసలు మిక్కుటమైనవి. ప్రజలు శాంతియుతమైన జీవితమును సాగించవలెనని అనేక ప్రయత్నములను సలుపుతూ వచ్చారు. ఈ విషయము ప్రతియుగము నాతత్వమై వర్ధిల్లుతున్నది ఒకమానవుని అభిప్రాయము వేరొకవిధముగా అర్ధము చేసుకోవడము వైషమ్యము పెరుగుతుంది కొన్ని సామాజిక వైమనస్యములు పై విధముగనే తారసిల్లునట్లు తెలియగలదు.

నేడు ప్రపంచంలో అన్ని జాతులలోనూ అన్ని శాఖలలో, అన్నికళలలోనూ ఏకత్వము అపాదింప ప్రయత్నములు జరుగుచున్నవి - ఇట్లు ఏకముఖముగా అన్నిటిని ప్రవహింప జేయుటకు పరస్పరసానుభూతి ముఖ్యసూత్రం ఒకజాతియొక్క ఆచారములపైన, సంస్కృతిపైన, సాహిత్యముపైన సానుభూతిలేనిదే వేరొకజాతి ఆదరము చూపింపజాలదు. ఈ యేకీకృత ప్రపంచ ధర్మములలో సర్వమానవులకు శాంతిభద్రతలు చేకూర్చుచూ విజ్ఞానజ్యోతిచే వారివిశాలహృదయయులుగా చేయుట ప్రధానోద్దేశ్యము.

ఇట్టిపరిస్థితులలో ఆంధ్రులస్థితి విచారింపతగినది- చరిత్ర మూలమున తదితరజాతీయులకు ఆంధ్రుల ప్రాచీన విజ్ఞానసంపదలు విశదమైనవి- నేడు ఆంధ్రులేకముఖముగా నడచి వారి నెదుర్కొను సమస్యలను పరిష్కరింపవలసియున్నది- ప్రాచీన

సంస్కృతిని ఉపాధిగాపెట్టుకొని నేటి ప్రపంచధర్మమైన ఐక్యతసాధనలలో కృషిసల్పవలెను- నేటికిని ఆంధ్రు లనేకత్వముగానుండుట గర్హింపతగినది- కారణవశమున ఆంధ్రకుటుంబములు చెల్లాచెదరై నప్పటికి అవి అన్నియు ఏకజాతిభవములే కదా! ఈ కుటుంబకలహం వలన జాత్యభ్యున్నతికే భంగపాటు జరుగును- ఆంధ్రదేశములో ఈ నాడనేక సాంఘిక రాజకీయ, సాహిత్య ఉద్యమములు బయలుదేరినవి- ఏ ఉద్యమమైనా జాతిను తేజకరముగా నుంచుటకై గదా ఉద్దేశింపబడినది- జాతి అనగా వ్యక్తిసంబధమేగదా జాత్యైక్యత వ్యక్తులమధ్య ఐక్యత లేనిదే పొసగదుకదా! ఈ వ్యక్తులలో సామరస్యము కుదర్చని ఉద్యమములు నిష్ప్రయోజనములగును-

"మహాంధ్రము" ఆంధ్రఉద్యమ కృషీవలుర సంకల్పమై యుండాలి- దానిని సిద్ధింపజేయడానికి నాయకులు, పండితులు, కవులు పాటుబడవలసి యున్నది తెలంగాణాలోని ఆంధ్రులు, రాయలసీమలోని ఆంధ్రులు, ఉత్తరసర్కారుల లోని ఆంధ్రులు తదితర ప్రదేశములలోని ఆంధ్రులుకలిసి "మహాంధ్ర" భావములోనికివచ్చి భేదాభిప్రాయములులేక, యేకముఖముగా ఆంధ్రుని, పార్థక్యము చాటవలసినసమయము వచ్చినది- నేటి ఆంధ్రులు ఇట్టివిశాల దృక్పథ మలవరచుకొనవలెను- కవులీ ఐక్యభావమును ప్రేరేపించు రచనములను సల్పవలెను- నాయకులిందుల కుపన్యాసాదికములు ద్వారా పాటుబడవలెను- ఈమహాంధ్రభావం కలిగినపిమ్మటనే మన ఆంధ్రజాతి ఏమహోద్యమమునైన తలపెట్టవలసియున్నది. అప్పుడు

ప్రారంభించు కార్యక్రమములో యెట్టివిఘ్నము లేకయుండును- జాతినిర్మాణ కార్యములన్నియు మహాంధ్రభావపు పునాదులపై సర్వమానవ కళ్యాణసూత్రము చక్కగా నిర్వహింపబడగలవు- ప్రస్తుతము కావలసినవి మహాఆంధ్రుడు మహాంధ్రభావము- యేకీకృత ప్రపంచము- సర్వమానవ శాంతిభద్రతలు- విశ్వ కళ్యాణము- అనెడి భావములే.

[ మీజాన్ పత్రికలో 29.4-1945తేదిన ప్రకటితమైనది. ]

★

౧

# రాధ

సీతమ్మకు పదహారు కానుపులు నష్టమయినాక చివరి కానుపుకి ఒక ఆడపిల్ల కలిగింది. రామారావు స్నేహితులూ, సీతమ్మను ఎరిగున్నవాళ్ళూ ఆడపిల్లేనా అని ఎగతాళిచేశారు. అదే పేదకు పెన్నిధి లభించినట్లయింది సీతమ్మకు. ఈపిల్లైనా నాలుగు కాలాలపాటు బ్రతికి బట్టకడితే చాలని ఆమె అనుకున్నది. తల్లీబిడ్డా సుఖంగా బయటపడ్డందుకు రామారావు చాలా సంతోషించాడు. పదకొండోనాడు స్నేహితుల్ని పిల్చి పెద్ద డిన్నరుచేశారు. అందరూ "నల్లపిల్ల" అంటూ పాపాయిని ఎగతాళిచేశారు. కాని కాకిపిల్ల కాకికి ముద్దేగా!

ఒకనాడు సీతమ్మ "మన పాపాయికి పేరేమి పెడుతాము?" అని ప్రశ్నించింది పిల్లను ఒళ్ళోపెట్టుకుని. శాస్త్రప్రకారం అన్నీ సంస్కారాలుచేసినా మిగతా సంతానము నష్టము కావడముచేత ఈసారి పుణ్యాహవాచనము. భారసాల మానివేసి "ఛార్యతో" ఎవరెట్లా పిలిస్తే అదే మన పాపాయిపేరు." అని బయటకు వెళ్ళిపోయినాడు.

ఒకనాడు ప్రక్కవారి బ్బాయి ఆరేళ్ళవాడు వచ్చి "అత్తా! పాపాయిపేరేమిటి?" అని అడిగాడు. సీతమ్మ కుతూహలముగా "ఏమని పిలిస్తే బాగుంటుంది?" అని అడిగింది. "రాధ అంటే బాగుంటుంది అత్తా!" అని సమాధానమిచ్చి పాపాయిని తన ముద్దుమాటలతో ఆడించసాగాడు అతనిపేరు మురళీకృష్ణ. "ఈ పాపాయికి నువ్వు పెట్టిందే పేరు! మేమంతా

కూడా అలాగే పిలుస్తామునాయనా !'' అని కృష్ణుని ముద్దాడింది సీతమ్మ, ఆరోజునుండి అంతా "రాధా" అని పిలువడము మొదలుపెట్టారు.

రాధాకృష్ణులు నాటినుండీ కలసి ఆడుకుంటూ ఒకటిగానే వుంటూ వచ్చారు. రాధను ఎప్పుడూ చంకదించేవాడు కాదు. మురళి రకరకాల బొమ్మలూ ఆటవస్తువులూ తెచ్చి ఆడించేవాడు. రాధ అమాయిక చూపులతో చూస్తూవుండేది. ఎవరిదగ్గరకూ వెళ్ళేదికాదు. కృష్ణుడొస్తే కిలకిలా నవ్వేది.

రాధ క్రమక్రమంగా ఆటలూ మాటలూ నేర్చింది. అయిదోఏట కాన్వెంటులో చేర్చి వచ్చాడు కూతుర్ని రామారావు. ఆ కిరిస్తానీల బళ్ళోకి ఎందుకని సీతమ్మ మొత్తుకుంటూ వుండేది. బీదవారంటే రాధకు అపరిమితమైన ప్రేమ. తల్లి కొనుక్కుని తినమని డబ్బులిస్తే బీదవారికి పంచిపెట్టి తిన్నానని తల్లితో చెప్పేది. కాన్వెంటు కెదురుగాఉన్న స్కూలులో కృష్ణుడు ఫస్టుఫారం చదువుతున్నాడు. ఇకనేమి, మధ్యాహ్నం తోటలో యిద్దరూ తాము తెచ్చుకున్న తినుబండారాలు పంచుకుని తింటూ వుండేవారు. ఇద్దరూ కలసే స్కూలుకు వచ్చేవారూ, కలసే యింటికి వెళ్ళేవారు. రాధ ప్రక్కనే నడుస్తూ- తను రోజూ చేసే వీరకృత్యాలు వర్ణించి చెప్తూ వుండేవాడు. కృష్ణుడు తప్ప లోకంలో ఎవరూ అట్లాంటివి చెయ్యలేరని రాధ నమ్మకము. అతను చెప్పేవన్నీ చెవులు దొరగిలబెట్టుకుని కళ్ళు పెద్దవిచేసి వింటూవుండేది.

రాధ క్లాసు లీడరయింది. అందరూ ఆమెను మెచ్చుకునేవారు. ఒక్కటే సంతానమవడమువల్ల ఆడపిల్లైనా, మొగపిల్లవాడైనా ఆమే తలిదండ్రులకి. లాల్చీ పైజామావేసి గాంధిటోపీతో స్కూలుకు వెళ్ళేది. ఇరుగుపొరుగు అమ్మలక్కలు "దీనిని ఎవడుచేసుకుంటాడో గాని మూన్నాళ్ళల్లో అమ్మకు వస్తుంది." అనేవారు ఆమెనుచూచి.

ప్రతిక్లాసూ ఫస్టున ప్యాసవుతూ మూడవఫారములోకి అడుగుపెట్టింది రాధ. పరికిణీలూ, జాకెట్టులూ వేయడము మొదలుపెట్టింది. చిన్నప్పటినుండి అర్భనాకారి కావడమువలన మందులూ, టానిక్కులూ పుచ్చింపడము ప్రారంభించారు తల్లిదండ్రులు. ఆ మందులవల్ల విపరీతముగా ఎదిగింది కృష్ణుడు కూడా గుర్తుపట్టడానికి వీలులేకుండా. ఇదిచూచి మనువు వెతుకమని రామారావుని పోరుపెట్టడము మొదలుపెట్టింది సీతమ్మ. నిండా పదేళ్ళులేవు అప్పుడే ఏమిటొచ్చిందని అన్నాడే గాని భార్యమాటకు ఎదురుచెప్పలేక పోయినాడు. బడి మాన్పించమని ఆరంభించింది సీతమ్మ కాని రామారావు ఆమాట చెవినిపెట్టలేదు.

ఫోర్తుఫారము చదువుతోంది. ఇంట్లో ప్రైవేటు మాష్టరు, సంగీతపుమాష్టరు కాచుకునేవారు. ఇవన్నీ అయ్యే సరికి రాత్రి ఎనిమిదో తొమ్మిదో అయ్యేది. కృష్ణునితో అది వరకటిలాగే మాట్లాడేటందుకు తీరిక అయ్యేదికాదు రాధకు. మనసులోనే బాధపడేది.

రామారావు మొదట్లో చాలా ఆస్తిపరుడు. కాని దుబారాకు ఆస్తి బలిపెట్టాడు. బి.ఎ. బి. యల్., ప్యాసయి

అడ్వకేటుగా ప్రాక్టీసు పెట్టిన వేళా విశేషమువల్ల బాగా సంపాదిస్తున్నాడు. వరులు తనకు మించిన కట్నములు అడగ సాగారు. మూర్ఖులూ, పొట్టపొడిచినా అక్షరముముక్క లేని వారుకూడా నాలుగు, అయిదు వేలు కట్నాలు అడగసాగారు. ఇక చేసేది లేక వెనక్కి తిరిగాడు. ఒకనాడు ఛటుక్కున ఒక ఆలోచన స్ఫురించినది రామారావుకు. తన గుమాస్తా రంగారావుకు మురళీకృష్ణ ఒకడే. ఏదో మధ్యరకము వాడు. కావున మనలను గౌరవంగా చూస్తాడు. మనపిల్ల మన కళ్ళయెదుటే వుంటుంది అనుకొన్నాడు రామారావు. ఇలా ఆలోచించి చెప్పులు తొడుక్కుని రంగారావు యింటికి దారితీశాడు రామారావు. రామారావు వెళ్ళేసరికి రంగారావు తాపీగా భోంచేసి కూర్చుని వున్నాడు కుర్చీలో. రామారావుని చూడగానే గౌరవంతో "కూర్చోండి పంతులు గారూ." అని కుర్చీ చూపించాడు. మాటలసందడిలో తన మనసులోవున్న కోరికను వెలిబుచ్చాడు రామారావు. రంగారావు మొదట నమ్మలేక నివ్వెరపోయినాడు. కాస్త తేరు కొని సంతోషమువలన నోటిలోనుండి మాటలేకుండా తల వూపాడు. ఒక శుభముహూర్తాన రాధాకృష్ణులు భార్యాభర్త లయ్యారు.

ఇంటరు ప్యాసయిన కృష్ణుని డాక్టరుకోర్సుకి పంపారు రామారావు. చాలా పట్టుదలతో చదువుతూ 3వ సంవత్సరము లోకి అడుగుపెట్టాడు కృష్ణుడు. కృష్ణుని దగ్గరనుండి వుత్తరం వస్తేగాని భోజనం చేసేదికాదు రాధ. క్రమక్రమేణా

ఉత్తరాలు వ్రాయడము మానివేశాడు ఎందుకో కృష్ణ! రాధ దిగులుపడడం ఆరంభించింది.

సముద్రపుటొడ్డున కూర్చున్న కృష్ణునికి "హల్లో మిస్టర్ కృష్ణ." అన్న మాటలు వినిపించినాయి. తిరిగిచూస్తే తన సహాధ్యాయిని వల్లి. "ఓ, మీరా!" అని ప్రత్యుత్తర మిచ్చాడు. ప్రక్కనే కూలబడి "మీతో కొంచెము పని వుంది. కాస్త మీ విలువైన టైములో కాస్త నాకు స్పేర్ చేస్తారా!" అని అడిగింది, సమీపంగా చేతిలో చిన్న సంచీని తిప్పుతూ. వల్లి మెడిసన్ సెకండియర్ చదువుతోంది. పెద్ద అందము లేకపోయినా ఆడంబరముగా కనుపిస్తుంది. జిలుగు వస్త్రాలతో, స్నో పవుడర్లతో ఘుమఘుమ లాడుతూ వుంటుంది. చూపరుల హృదయాల్ని ఇట్టే ఆకర్షిస్తుంది.

"అలాగే" నంటూ ఆమె వెంట బయలుదేరాడు కృష్ణుడు. ఎవరూ కనుపడని చోటుచూసి కూచుని అతణ్ని కూడా కూర్చోబెట్టింది. సంభాషణ ప్రారంభించింది వల్లి. "రేపు మన కాలేజీ వార్షికోత్సవాన్ని గురించి మీ సలహా అడుగుదామని వచ్చాను. కొంచెము ఈ కార్యక్రమమును చూసి సరిచేసి పెట్టండి." అంటూ తన బేగ్‌లోంచి కొన్ని కాగితాలు తీసి అతడికిచ్చింది. శ్రమయిచ్చినందుకు క్షమించ మంటూ, "ఇవన్నీ ఇప్పుడే చూడాలా, లేక నాకు ఒక రోజన్నా వ్యవధానముయిస్తారా!" అని అడిగాడు. తొందరేమీ లేదు లెండి. రెండురోజులైనా ఫరవాలేదు. అని అంటూ లేచింది వల్లి. ఇద్దరూ ఎవరి రూములకు వారు వెళ్ళిపోయినారు. వల్లీ

కృష్ణుల సాయంవలన వార్షికోత్సవము చాల బాగాజరిగిందని అంతా ప్రశంసించారు. ఈ సంఘటనతో తరుచూ ఇద్దరూ కలుసుకుంటూ వుండేవారు. బీచీకి షికారుకు వెళ్ళేవారు. వల్లి వలన కృష్ణ ఆకర్షించబడి రాధను మరిచిపోయినాడు. వల్లి ప్రార్థనా ఫలితంగా శలవలుయిచ్చినాక కృష్ణ భార్యవద్దకు పోక వల్లి స్వగ్రామమైన మద్రాసు వెళ్ళాడు.

ఆనందరావు మద్రాసులో పెద్ద ఫరములో మేనేజరుగా పనిచేస్తూ వున్నాడు. గొప్ప సంస్కారి. వల్లి "నాన్నగారూ! వీరు మెడిసన్ మూడవ సంవత్సరము చదువుతున్నారు. వీరి పేరు మురళీకృష్ణగారు. చాలామంచివారు." అంటూ పరిచయం చేసింది తండ్రికి వల్లి. వల్లీ కృష్ణులను ఆప్యాయంగా ఆహ్వానించాడు ఆనందరావు. వారికి ఏ కొరతా లేకుండా సెలవలన్నీ హాయిగా అక్కడగడచిపోయినాయి. ఆ సందడిలో పడి తన తల్లి తండ్రులనూ, భార్యను మరిచేపోయినాడు కృష్ణుడు.

మళ్ళీ కాలేజీలు తెరిచారు. వల్లీ కృష్ణుల స్నేహబంధము క్రమంగా ప్రణయబంధముగా మారిపోసాగింది. వల్లీ సాన్నిధ్యములో సర్వమూ మరచాడు కృష్ణుడు.

అకస్మాత్తుగా ఒక రోజు మామగారివద్దనుండి వైరు వచ్చింది కృష్ణకు. ఏమిటోనని విప్పిచూశాడు. "Very Serious, Start." అని వున్నది! వెళ్ళకుండా ఎట్లా? వల్లిని వదలలేక వదలలేక వదలి త్వరలో వస్తానని చెప్పి వెళ్ళిపోయినాడు స్వగ్రామానికి కృష్ణ.

సీతమ్మకు చాలా జబ్బుగా వున్నది. రాధ తల్లి శుశ్రూషచేస్తూ కూర్చుంది ప్రక్కనే; పరామర్శించడానికి

వచ్చిన అమ్మలక్కలు సూరమ్మగారూ చూశారు! సూదుల లాగా వచ్చి దబ్బనాలలాగా తేల్తారంటారు దీనినే. మొన్న మొన్నటి కృష్ణుడు ఎలా తయ్యారయ్యాడో చూశావా! పెళ్ళామంటే నిన్నటిదాకా ప్రాణమిచ్చేవాడు. ఆ ఆపేక్షంతా ఏగంగలో కొట్టుకుపోయిందో! ఈ కాలపువారి నడవళ్ళు యిలాపుంటాయి అంటూ వ్యాఖ్యానము చేసిందొక ఇల్లాలు రాధవంకచూస్తూ. రాధకు యీ మాటలు వాడి బాణాల లాగా హృదయాన్ని గాయపరిచినై.

*   *   *   *

రాధ స్నేహితురాలైన విమల భర్త మోహన్ కృష్ణుడితోపాటే మెడిసన్ చదువుతున్నాడు పట్నంలో కాపురము పెట్టి. విమల కృష్ణుడి నడవడంతా భర్త ద్వారా విని తూ, చా తప్పకుండా రాధకు జాబు మూలకంగా తెలియజేసింది. తల్లి తండ్రులకి తెలిస్తే కుంగిపోతారని తనలో తానే కుమిలి పోసాగింది రాధ. తన చిన్నతనము జ్ఞాపకము రాసాగింది. ఎంత స్వేచ్ఛగా కృష్ణుడూ తానూ జంటగా తోటల వెంటా దొడ్ల వెంటా గెంతుకుంటూ తిరిగేవారూ. ఒకనాడు కృష్ణుడికి తెలియకుండా వెనుకనుండి పోయి కళ్ళుమూసింది తను. ఆనాడు ఎందుకో కృష్ణుడు చికాకుగా వున్నాడు. కోపంతో రాధను చెంప చెళ్ళుమనిపించాడు. రాధ బుంగమొగంతో "యిక నీతో మాట్లాడనులే." అని కళ్ళవెంట నీరుకారిపోగా వెనుతిరిగింది. కృష్ణుడు వెంటనే రాధను దగ్గరకు తీసుకొని "రాధా! ఏడవ్వాక! యిక ఎప్పుడూ కొట్టనుగా; ఒకసారి

నవ్వు! అంటూ కితకితలుపెట్టి నవ్వించాడు. ఆనాటినుండి కృష్ణుడు తనను ఎన్నడూ పల్లెత్తుమాటకూడా అనలేదు.

ఆనాడు ఎంతస్వేచ్ఛగా తిరిగిందో యీనాడు అంత పరతంత్రి అయింది. రోజులు యుగాలలాగా దొర్లిపోతు న్నాయి. తన ప్రాణాలకన్న మిన్నగా ప్రేమించి సేవించింది భర్తను. మొదట్లో తనను వెలుగుబాటలలో, స్వర్గవీధులలో విహారింపజేసాడు. ఈనాడు దుఃఖముతో వెళ్ళబుచ్చవలసి వచ్చింది. ఒకనాడు తన తల్లి తనని ఏదో కోప్పడితే, తోటలో చెలువు గట్టునపోయి కూర్చుంది అభిమానముతో ఏడుస్తూ! ఇలావుండగా ఎప్పుడొచ్చాడో తనభర్త! తనని చేతుల్లోకి తీసుకుని "రాధా! ఇట్లాంటివన్నీ మనసులో వుంచుకుని బాధపడుతావు, నన్ను బాధపెట్టుతావు! నేను బ్రతికివుండగా నీవేమీ బాధపడవలసిన పనిలేదు." అన్నమాటలు గుర్తు కొచ్చి దుఃఖముతో కుమిలిపోసాగింది రాధ... ఇలా పూర్వ స్మృతులతో బాధపడుతూ వుండగా! రాధా! మీ ఆయ నొచ్చాడు. కాళ్లుకడుక్కోడానికి నీళ్ళివ్వు." అంటున్న తండ్రి మాటలు విని ఉలిక్కిపడ్డది రాధ.

కళ్ళు తుడుచుకొని హృదయము ఆనంద తరంగితము కాగా చెంబుతో నీళ్ళు తెచ్చి ముందుపెట్టింది భర్తకు. కృష్ణుడు కాళ్ళు కడుక్కుని ఎవరితో ఏమీ మాటలాడకుండా గదిలోకి వెళ్ళిపోయినాడు. కాఫీగ్లాసుతో రాధ వచ్చింది. కృష్ణునికి చదువుకు తాను వెళ్ళినప్పటి రాధకూ, యీనాటి రాధకూ చాలా తేడా కన్పించింది. తన అక్రమానికి కఠినత్వానికి చాలా నొచ్చుకున్నాడు. అతని కళ్లవెంట నీళ్లుతిరిగాయి. "ఈరీతిగా

రాధ యెడల నీవు యింకా కొంతకాలము ప్రవర్తిస్తే రాధ నీకు దక్కదు సుమా!'' అని అతనిమనస్సు అతణ్ని ఉద్బోధించింది. ఈ ఆలోచనతో పడుకున్న కృష్ణుడు గభాలున లేచి రాధ రెండుచేతులూ పుచ్చుకుని "రాధా! నన్ను క్షమించవూ!" అంటూ చేతుల్లోకి తీసుకున్నాడు. రాధ తలయెత్తి కృష్ణుడి కళ్ళల్లోకి చూసింది సాభిప్రాయంగా; ఆ చూపుల దైన్యానికి తట్టుకోలేక ఆగదిలోనుంచి నిష్క్రమించాడు కృష్ణుడు.

రాధ తల్లి సీతమ్మ గుండెజబ్బుతో బాధపడుతోంది. దానికి తోడు టైఫాయిడ్ జ్వరము. రాత్రినుండి పిచ్చి పిచ్చి మాటలు. సీతమ్మ బాగా నీరసించి యివాళో రేపో అన్నట్టు మంచాని కంటుకుని వున్నది. అత్తగారి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ ప్రక్కనే నిలబడ్డ మామగారితో "ఎలా వుందండీ! ఏమంటాడు డాక్టరు ?" అని ప్రశ్నించాడు కృష్ణ. ఇంతలో సీతమ్మ కళ్ళు తెరచి "రాధా!" అని కుమార్తెను పిలిచింది. రాధ "ఏమిటమ్మా" అంటూ ఆహాలులో ప్రవేశించింది. "ఇలావచ్చి కూర్చో అమ్మా" అంటూ రాధను తన ప్రక్కను కూర్చోపెట్టుకుని "నీవుకూడా ఇలాకూర్చో నాయనా" అని కృష్ణను యింకోప్రక్కను కూర్చోపెట్టుకుని "ఈరోజునుండి రాధ భారమంతా నీదే! తల్లిలేని కొరత కనుపడకుండాచేయి! నీ చేతుల్లో పెట్టి వెళ్ళుతున్నాను. సుఖంగా సంతోషంగా, చిలుకా గోరింకలులాగా మెలగండి." అంటూ రాధ చేయి కృష్ణుడిచేతితో కలిపి వారిని దీవిస్తూ తృప్తిగా భర్తవంక తిరిగి సెలవుతీసికొంటున్నా నన్నట్లుగా చూసి శాశ్వతంగా కన్నుమూసింది సీతమ్మ.

౨

# జంటపూలు

సుబ్బారావు బి. ఏ. బి. ఎల్ ప్యాసైనాడు. భార్య రత్తమ్మ పూర్వకాలపు భావాలుకలది. అతనికి ప్రాక్టీసువల్ల ఏమీరాకపోయినా గుంభనముగానే సంసారము సాగిస్తూ న్నాడు. వారికి ఒక్కర్తే ఆడపిల్ల లేక లేక కలిగింది. ఆమెను గారబంగా పెంచారు. తండ్రి పిల్లకుచదువూ, సంగీతమూ నేర్పుతానంటాడు. తల్లి పనిపాటలునేర్పి తొమ్మిదోఏట పెళ్ళి చేదామంటుంది. ఏలాగైతేనేం తండ్రిపట్టుదలేనెగ్గి స్కూల్లో చేర్చారు. సరళకూడా చాలా చురుకుగానే చదువుతూ పద హారవ ఏటనే స్కూలుఫైనలు ప్యాసయింది ఫస్టుక్లాసులో. తండ్రి సంతోషంగా కాలేజీలోచేర్చాడు. ఇది తల్లికి చాలా కంటగింపుగా ఉండేది, ఈడేరినపిల్లకు ఈ వేషాలు ఏమిటని. కాని ఆవిడను లెక్కపెట్టేవారుకాదు తండ్రీ కూతుళ్లు.

రవీంద్రుడు జమిందారుకొడుకు. తండ్రి జనార్దనరావుకు సాలుకు రెండులక్షల ఆదాయం ఉన్నది. తల్లిసీతమ్మ దయా దాక్షిణ్యాలు కల యిల్లాలు. జమీందారు జనార్దనరావు పిల్లికి కూడా బిచ్చము వెయ్యనిచ్చేవాడుకాడు. సీతమ్మ తనయింటి నౌకర్లను, బీదాబిక్కిని చాలా ఆదరిస్తూఉండేది ఆయనకు తెలియకుండా. రవీంద్రుడు వారికి కానకకన్న సంతానమవడము వల్ల చాలా గొప్పగాపెంచారు. అతనుకూడా సరళకాలేజీ లోనే బి. ఏ. చదువుతున్నాడు.

ఆనాడు కాలేజీ ఆనివర్శరీ (వార్షికోత్సవము.) నాటకాల సందడిలో ఉన్నారు పిల్లలంతా. నాయకునిపాత్ర రవీంద్రునిది. నాయకురాలిపాత్ర ఎవరిదోనని అందరికీ ఆత్రంగా ఉన్నది. ఇంట్లోనే రిహార్సల్సుముగించుకొని సాయంకాలము మూడు అయేసరికి టాయ్‌లెటు అయి కాలేజీకి వెళ్ళాడు. డిబేట్లు అవుతున్నాయి ఒకప్రక్క. జడ్జీలు ముగ్గురూ వేదిక మీద కూర్చునివున్నారు. పాల్గొనేవారి పేర్లు చదివారు. సరళ పేరువచ్చింది. సరళవచ్చి ఎదిరివాదాన్ని నిముషంలో ఖండించి తనవాదాన్ని అత్యద్భుతంగా నిలబెట్టింది. అందరూ ముగ్ధులయ్యారు. ఆమెవాగ్ధాటికి, వాక్చమత్కారానికీ రవీంద్రుడు కూడా ఆశ్చర్యపోయాడు.

అయిదు గంటలయింది. హాలంతా కిటకిటలాడుతోంది. బయటివారూ, కాలేజీలెక్చరర్లూ, విద్యార్థులుకూడా హాలు నిండా కిక్కిరిసివున్నారు. నాటకారంభమునుండి నాటకాంతము వరకు ప్రేక్షకులు కిక్కురమనలేదు. అది అయినాక సరళ వీణపైన హాయిగా గానముచేసింది. ఆనాటి కార్యక్రమం దిగ్విజయంగా నెరవేరినందుకు విద్యార్థి కార్యదర్శి ధన్యవాదాలు చెప్పాడు. ఆనాటకంలో రవీంద్రుడూ, సరళాదేవీ ఎక్కడలేని ఉత్సాహముతో నటించారు. అందుకు మెచ్చుకుంటూ ప్రిన్సిపాలు రవీంద్రునికీ, సరళకూ మెడల్సు బహుమానమిచ్చారు. ఎవరి దోవన వారు ఇంటికివచ్చారు. సరళా రవీంద్రులపేర్లే ఎవరినోటంటవిన్నా!

ఇంటికి వచ్చేసరికి సరళ తల్లికి జ్వరము. ఉన్నంతలోనే డాక్టరుచేత వైద్యము చేయిస్తున్నాడు సుబ్బారావు. ఇంట్లో

సరళ తల్లి సేవజేస్తూ కాలేజీకి వారమురోజులు సెలవు పెట్టింది. కాని పాపం ఏమిలాభం? వీళ్ళ ఆశలు నిరాశలయాయి. తండ్రీ కూతుళ్ళను దుఃఖములో ముంచిపోయిందా తల్లి! అంతే– ఆనాటినుంచే మంచము పట్టాడు సుబ్బారావు. వచ్చే రాబడీ తగ్గిపోయింది. ఇంక చెప్పేదేముంది. సరళ చదువు మూలబడ్డది. రానురాను ఇల్లుగడవడమే సమస్య అయి పోయింది. కాగా ఆమె ఆర్జనకు దిగక తప్పిందికాదు. ఏం చేస్తుంది పాపం! సరళ ఒక ఆఫీసులో పనికి చేరింది. ఆమెకు మనశ్శాంతి మాత్రము లేదు. తండ్రిని కాపాడుకోలేక పోయింది. పిచ్చెక్కి తండ్రి గతించాడు పాపం! సరళ యీ ప్రపంచ ములో ఏకాకి అయింది. అలాగే 'దేహి' అని ఒకళ్ళని యాచించకుండా రోజులు గడుపుతోంది. తండ్రికూడా కరువై పోవడము మూలాన ఆ పరిసరాల్లో ఉండడం దుర్భరమై పోయింది ఆమెకు. అందుకని ఆయిల్లు వదిలి యింకో చిన్న ఇల్లు తీసుకున్నది.

రవీంద్రునికి కాలేజీలో సరళ కనిపించక పోయేసరికి పిచ్చిఎత్తినట్లయింది. ఒక సాయంత్రము సరళయింటిని వాకబు చేసుకుంటూ తిరగడము మొదలుపెట్టాడు. తిరిగి తిరిగి వేసారి విఫలుడై తనయిల్లు చేరాడు.

ఆనాటినుంచీ తిండి తినడు, నీరుత్రాగడు. ఒకటే మౌనము. తల్లిదండ్రులు ఎంత గుచ్చి అడిగినా సంగతి చెప్పడు. రోజూ కాలేజీకి మటుకు వెళ్ళి వస్తున్నాడు. అట్లాగే బి. ఏ. ప్యాసు అయినాడు. జమీందారుబిడ్డడు. ఆయిన కేమ్మి

కోదవ. ఉద్యోగము చెయ్యనక్కరలేదు. అందుచేత తన తండ్రి స్థాపించిన కళాశాలకు సెక్రటరీగా పనిచేస్తున్నాడు.

సరళ ఒకనాడు పేపరు చదువుతూ తన యింటి వసారాలో కూర్చుంది. అందులో ఒక ప్రకటన ఆమెను ఆకర్షించింది. దాని నిలా చదివింది.

"కావలెను.

జనార్ధన కళాశాలకు స్త్రీ అధ్యాపకురాలు కావలెను. రూ 300-0-0లు నుండి రూ 600 0-0 దాకా గ్రేడ్ యిస్తాము. దరఖాస్తులు నెలాఖరులోగా సెక్రటరీకి చేరాలి"

సరళ అదృష్టాన్ని నమ్ముకొని అప్లికేషను పడవేసింది. కాని హేమాహేమీలుండగా సరళ గ్రాడ్యుయేటయినా కాదుగా, ఎట్లా వస్తుంది ఉద్యోగం? అక్కడా నిరాశే. ఎవరో M. A. ను appoint చేశారు అధ్యాపకురాలిగా.

సరళ పనిచేసే యజమానికికూడా ఆ కళాశాలలో భాగముంది. కాబట్టి రవీంద్రుడికీ యజమానికీ బాగా పరిచయముంది. ఆ పరిచయాన్ని పురస్కరించుకుని వారిద్దరూ కలసి మెలసి ఉండేవారు. ఒకరోజు ఆఫీసరుతో మాటలాడటానికి రవీంద్రుడు వచ్చాడు. ఆఫీసులోకి అప్పుడే అడుగుపెడుతున్న సరళ అతని కంటబడింది. సరళ యీఆఫీసులో ఎందుకు పని చేస్తున్నదా అని ఆశ్చర్యపోయాడు. కాని సరళ తలవంచుకుని వెళ్ళడమువల్ల రవీంద్రుని ఆమె చూడలేదు. రవీంద్రుడు ఆఫీసరుని సరళ భోగట్టా అడిగాడు. ఆమెను కనుక్కొని చెపుతానన్నాడాఫీసరు. ఆ మరునాడు సరళాదేవిని ప్రైవేటు రూముకు పిలచి భోగట్టా విచారింప బూనుకున్నాడు ఆ

ఆఫీసరు. "సరళాదేవిగారూ! మీ నివాసమెక్కడ?" అని అడిగాడు ఆఫీసరు.

"నా అడ్రెసు మీకెందుకు! మర్యాదస్థులని అనుకున్నందుకు బాగా శాస్తిఅయింది. ఇలా ప్రవర్తించేటట్లయితే యిదుగో నా రాజీనామా!" అని దురుసుగా కాగితము వ్రాసి యిచ్చి బయటికి వెళ్ళిపోయింది. ఇలా అవుతుందనుకోలేదు ఆఫీసరు.

ఆ తరువాత ఆత్రంతో ఆమెఅడ్రెసు కోసరము వచ్చాడు ఆఫీసరు దగ్గరకు. ఏంలాభం! అక్కడా నిరాశా ఎదురైంది. ఆ పక్కగ్రామంలో సరళ ఒక బోర్డుస్కూలులో టీచరుగా చేరింది. ఒడుదుడుకులులేకుండా హాయిగా వెళ్లి పోతున్నాయి రోజులు.

రవీంద్రుడు తండ్రివద్దకు పోయి తనకు ఇంటనుండ వాంఛలేదనీ, దేశాటనము చేయదలచుకున్నాననీ, అందుకు డబ్బు కావాలి అనీ తండ్రిని అడిగాడు.

తండ్రి "ఇప్పుడు డబ్బు ఎక్కడనుంచి వస్తుంది! అదేమైనా పాతరా! తవ్వితే రావడానికి! "అని అన్నాడు. చకితుడై రవీంద్రుడు" అదేమిటి నాన్నగారూ! నాపాటికి నేనుంటానంటే మీకంత కష్టమెందుకు! ఒక వెయ్యిరూపాయలు చాలు." అని కోపంగా అన్నాడు.

తండ్రి డబ్బూలేదు! దుబ్బూలేదు! మాటలాడక ఇంట్లోనే ఉండు అన్నాడు. రవీంద్రు డుడికిపోయినాడు. ఇంక ఇట్లా కాదనుకుని సత్యాగ్రహము మొదలుపెట్టాడు. అన్నము

తినడు, నీళ్ళు త్రాగడు. ఒకటే ఆలోచన. రెండురోజులు గడిచినాయి. తల్లి సీతమ్మ చూడలేకపోయింది రవి వేదనను. తన నగలిచ్చి బ్రతిమలాడింది. రవి ఆత్రంతో ఆ నగలు తీసుకుని ప్రయాణమై వెళ్ళిపోయాడు. ఎక్కడికో! తమగ్రామపు చుట్టు ప్రక్కల ఊళ్ళన్నీ తిరిగాడు. చివరికి ఒకగ్రామంలో ప్రత్యేకంగా ఒకగది అద్దెకు తీసుకుని సరళకొరకు గాలిస్తున్నాడు పుట్టెడు ఆశతో! ఒకనాడు రవీంద్రుడు వీధంట నడుస్తుండగా ఒక జట్కా తన ముందునుండి వెళుతూవుండడం చూశాడు అప్రయత్నంగా అతనికండ్లు వెళ్ళాయి అటు! ఆశ్చర్యం! ఆమె సరళే! వెంటనే అద్దెసైకిలుతీసుకుని వెంటపడ్డాడు ఆ జట్కాను. అది ఆగినచోట తనూ ఆగాడు. బ్యాటరీ లైటుతో గుర్తు చూచుకుని "ధన్యోస్మి." అనుకున్నాడు.

మరునాడు రవీంద్రుడు ముస్తాబై తను గుర్తించిన చోటుకు వెళ్ళాడు. అది ఒకస్కూలు. సంకోచములేకుండా లోపలికి వెళ్ళి విజిటింగురూములో కూర్చున్నాడు. కొంచెము సేపయాక హెడ్ మిస్ట్రెస్ సుమిత్రవచ్చి తనకుర్చీలో కూర్చున్నది.

సుమిత్ర: మీపేరు ?

ర॥ రవీంద్రనాథు

సు॥ ఏమి పనిమీద వచ్చారు !

ర॥ ఏమీలేదు. నేనుకూడా మాపూరిలో ఒకస్కూలు నిర్మించదలచుకున్నాను. మీ ఏర్పాటులు చూడవలెనను కోర్కెతో వచ్చాను.

సు॥ చాలా సంతోషము. సరళాదేవిగారు మీకు స్కూలంతా చూపిస్తారు. అని సరళను పిలచి రవీంద్రునకు పరిచయము జేసింది. సరళ రవీంద్రునికి స్కూలంతా చూపించింది. చివరకు స్కూలు తోట చూడడానికి వారిద్దరూ వెళ్తున్నారు.

రవి॥ సరళాదేవిగారూ! మీ పరిచయభాగ్యం కలుగడము నా అదృష్టం. మీమూలాన స్కూలంతా చూచే భాగ్యము కలిగింది.

సరళ॥ Thanks, నాదేముందిలేండి! మీరు రవీంద్రునాథుగారుకదూ! కాలేజీ డేనాడు డ్రామాలో మీరు చేసిన అభినయం చాలా బాగుంది. అప్పుడే చెబుదామనుకున్నాగాని వెంటనే యింటికి వచ్చేసరికి మా అమ్మ ప్రమాదస్థితిలో ఉంది. అంటూ తనకష్టాలన్నీ వెళ్ళబోసుకుంది.

రవి॥ పాపం! ఎంతో కష్టపడ్డారు! మీరేమీ అనుకోకుండా ఉంటే ఒకమాటచెప్పుతాను. మీకేసాయము కావాలన్నా నేను చేస్తాను అని చెప్పాడు.

అప్పటినుంచి సరళా రవీంద్రులు స్కూలు తోటలో కలుసుకుంటూ ఉండేవారు. ఈవిధంగా వారి స్నేహాలత ప్రేమలతగా మారి ఒకరిని విడచి ఒకరు ఉండలేనంత వరకూ వచ్చింది. రవీంద్రుడు తనరూములో మడతమంచముమీద పడుకుని ఉండగా తండ్రివద్దనుండి టెలిగ్రాము వచ్చింది. 'Start Immediately." అని ఎందుకో అనుకొని బయలుదేరి సరళదగ్గరకు వెళ్ళి విషయమంతా చెప్పి ఈసారి వెళ్ళి

రాగానే రిజిష్టరు వివాహము చేసుకుంటానని చెప్పి కొంత పైక మిచ్చి వెళ్ళిపోయినాడు.

జనార్ధనరావు ఆతురతతో రవీంద్రుని ఆగమనము కోసము నిరీక్షిస్తున్నాడు. వాకిట్లో దివాను రామదాసు కూడా ఎదురుచూస్తున్నాడు. రవీంద్రుడు వచ్చి రావడము తోటే ఎవరితోటీ మాటలాడకుండా సరాసరి ఇంట్లోకి వెళ్ళి తండ్రి మంచమువద్ద కుర్చీలో కూర్చున్నాడు. దివాను రామదాసుకూడా లోపలికివచ్చి చేతులుకట్టుకుని నిల్చున్నాడు రవి ప్రక్కనే! జనార్ధనరావు కొడుకునిచూసి "నాయనా వచ్చావా!" అని రవీంద్రుని చెయ్యిపుచ్చుకుని "ఇక ఏమైనా ఫరవాలేదు. నీకోసము కళ్ళు కాయలుకాచేటట్లు వతికించి ఎదురుచూస్తున్నాను. నాది ఒక్కటే కోరిక. మీ అమ్మ నీవు వెళ్లిపోయావన్న దిగులుతో మంచముపట్టి స్వర్గానికి వెళ్ళిపోయింది. నేనింకా నీకోసము, నేనుచేసిన పాపాలకు ప్రాయశ్చిత్తము అనుభవించే నిమిత్తము ప్రాణాలను ఇంకా వదలలేదు. జరిగిందేదో జరిగింది. ఇవిగో ఎస్టేటు కాగితాలు, తాళముచేతులూ, నీవు ఒకయింటివాడవైతే నాకు మనశ్శాంతి చేకూర్చు. నాభారము తీరిపోయింది. ఇదే నాకోరిక" అంటూ ఆనంద పారవశ్యముచేత మాటలాడలేక పోయాడు. తల్లి చనిపోయిందనగానే రవి నిలువునా కూలిపోయాడు. కళ్ళ వెంబడి నీరుకారడము ఆరంభమయింది. తల్లి తనతండ్రికి తెలియకుండా తనకు చేసిన సాయానికి, తను ఆమె అవసాన దశలో తల్లికి చేయూత నివ్వలేకపోయినాడు. ఇదేనా తాను తనతల్లికి చేయవలసిన ఉపకారము ?

ఎన్నిజన్మలెత్తినా తను తల్లిఋణం తీర్చుకోగలడా ? ఇన్నిరకాలుగా అతను కుమిలి పోయినాడు. జట్కా చేసుకుని సరళ వున్న ఊరికి పోయి తీసుకువచ్చి, రిజిష్టరు వివాహం చేసుకున్నాడు. ఆనందసూచకంగా నగారా నౌబత్తులమధ్య ఆనాటినుండి తన జమీ రైతులకి పన్నులు, శిస్తులు తీసి వేశాడు. ఆనాటి రాత్రి తోటలో పొగడ చెట్టుకింద సరళా రవీంద్రులు కూర్చున్నారు. "చూచావా సరళా ! నీ ముఖము చూచి చంద్రుడుకూడా సిగ్గుపడి మబ్బుల్లో ముఖము దాచుకున్నాడు." అంటూ మేల మాడాడు. దానికి సరళ "మీకు యింకా చిన్నతనము వదల్లేదు" అంటూ సిగ్గుతో తలదించుకొని ఓరచూపుచూచింది భర్త వైపు. వీరికి సాక్షిగా పొగడ చెట్టు పూవుల్ని వారి శిరస్సులమీద ఆశీర్వాదపూర్వకంగా చల్లింది.

# 3

# గోపీ పశ్చాత్తాపము

గోపీ అంటే తల్లికి హడలు. చిన్నప్పుడు చాలా అల్లరి చేశేవాడు. గోపీ అక్కకొడుకు మోహనుకూడా గోపీ యీడువాడు. ఇద్దరూ కలసి జంటగా స్కూలుకెళ్ళి చదువుకునేవారు. గోపీ స్కూలులో చాలా కొంటెతనంగా నడిచేవాడు. ప్రతీ మాస్టరునూ ఆడించేవాడు. మరీ ఎక్కువగా తెనుగు మాస్టరును. ఆ మాస్టరు పాఠాలు సగము చెప్పి “ఏమర్రా! పిల్లలూ, నిశ్శబ్దంగా చదివి అర్థముకాకపోతే అడగండిరా?” అని కాళ్ళు రెండూ బల్లమీదనే చాచుకొని నిద్రపోయేవాడు. గోపీ లేచి నెమ్మదిగా మాస్టరి పిలకకీ కుర్చీకి కలిపి కట్టేవాడు. కుర్చీ క్రిందకి తోలేవాడు. దాని అనుభవము మాస్టరు ఉలిక్కిపడి లేవబోతే అయనతో పాటే కుర్చీకూడా లేచేది. నెమ్మదిగా సవరించుకొని లేచి “ఎవర్రా యీ పని చేసింది?” అంటూ బెత్తము చేత్తోపుచ్చుకొని ప్రత్యక్ష యముడల్లే నిలబడేవాడు. ఎవరుమట్టుకు వారు తాము కాదన్నట్లుగా క్లాసంతా మౌనము వహించేవారు. గోపీ లేచి “ఆ రమణారాయి గాడండీ! అరే! అప్పుడే యింటికి వెళ్ళిపోయినాడే!” అని చెప్పేవాడు.

ఇకయింట్లోనో! తల్లికీ గోపీకీ షష్టాష్టకమే! అమ్మ పెట్టెలో ఏముందో నన్న ఆసక్తి యెక్కువైపోయి వాళ్ళమ్మ పెట్టెలకీ బీగాలు పడటము ఎక్కువకా సాగింది. వాళ్ళమ్మను అట్లాపోనిచ్చి ఏ అట్లకాడో తెచ్చి తీసి డబ్బులు కాజేసి పోయేవాడు. వాళ్ళమ్మ తాళము క్రింద వుండటం కనిపెట్టి గోపీమీద

పళ్ళుకొరుకుతూ ఎప్పుడు వస్తాడా, ఎప్పుడు చావబాదు దామా అని యెదురుచూస్తూ గుమ్మమువద్ద కాపలావుండేది. సాయం కాలము పొద్దుగూకి గోపీ పదిమంది పిల్లలను వెంటతీసుకుని వచ్చే వాడు. గోపీవాళ్ళమ్మ "డబ్బులు ఏమిచేసావురా?" అని అడిగేది. గోపీ ఏమీమాటలాడకుండా గుమ్మంఅప్పగించి నిల బడేవాడు. ఆపిల్లలు- "మీగోపీ యివ్వాళ స్కూలుకి 2 రూ పాయలు చిల్లరగామార్చి బీదపిల్లలకి దానము చేశాడండీ!" అని చెప్పేవాళ్లు. "ఈతడవ దొంగతనంగా డబ్బులుతీయి చెబుతా నీపని" అంటూ గోపీని కొట్టడానికి చేతులురాక విసు గుకుంటూ వెళ్ళిపోయేది.

సెలవులలో గోపీవాళ్ళఅక్కయ్య గారింటికి వెళ్ళేవాడు మోహనుతో! వాళ్ళక్కయ్యకు డజనుమంది పిల్లలు. పాడీ పంటా సమృద్ధిగావున్నాయి. వాళ్ళక్కయ్య "ఒరేగోపీ! ఆ అల మరలోవున్న పెరుగుకుండను యిట్లాతీసుకురా!" అని పురమా యించేది. గోపీ ఆ అట్టగట్టిన మీగడను తిని, కొద్దిగా మోహను మూతికి రాసి వెళ్ళిపోయేవాడు. అక్క సుబ్బులు మోహను మీగడ తిన్నాడనుకుని మోహనుకు వడ్డించేది. ఇంకోసారి గోపీ, మోహను చెరువుకు స్నానానికి వెళ్ళారు. నీళ్ళల్లోకి దిగి కబుర్లు చెప్పుకుంటూ స్నానము మొదలుపెట్టారు. ఎందుకో మాటలుకాస్తా మూటలయినాయి. ఒకర్నొకరు కొట్టుకున్నారు. ఆ కోపంతో ఒళ్ళుతెలియకుండా బాదాడు మోహన్నుగోపీ! "ఉండునీపని మాఅమ్మతో చెబుతాను" అంటూ యింటికి పరుగులంకించుకున్నాడు మోహను. గోపీ మోహనుకన్నా వేగంగా పరుగుతీసి మధ్యలోనే మోహనును

అంకుని చెరువులోకీడ్చి ముంచడము మొదలుపెట్టాడు. మోహానుకు ఊపిరి తిరుగక కొట్టుకోసాగాడు. ఎందుకో వాళ్ళ బావ అక్కడికి వచ్చాడు. ఈ దృశ్యము చూసి గబాల్న మోహానును బయటకు లాగి గోపీని కొట్టబోయేసరికి ఒక్క దూకున ఉరికి జామతోటలోకి మాయమయి చిటారుకొమ్మ యెక్కి కూర్చున్నాడు. "ఇంటికిరా! వెధవా! తాటవలుస్తా" అంటూ మోహానును వెంటబెట్టుకుని యింటికి వెళ్ళిపోయినాడు వాళ్ళబావ. గోపీకి వాళ్ళ అమ్మ జ్ఞాపకము వచ్చింది. కళ్ళ వెంబడికారే నీటిని తుడుచుకుని ఆలోచన ఆరంభించాడు. అక్క గారింటికి వెళుతేనేమి? అమ్మో! బావ చంపుతాడేమో! యిక్కడనుండి సరాసరి స్టేషనుకు వెళ్ళిపోతే! టిక్కెట్టుకి డబ్బు ఏది! సెలవలింకా వారంరోజులున్నాయే ఎట్లా! అమ్మని తలుచుకుని కళ్ళవాచేటట్లు ఏడిచాడు. ఇట్లాంటిపనులు యింకెప్పుడూ చెయ్యనని లెంపలు వాయించుకున్నాడు. కళ్ళుతెరచి చూచేసరికి పొద్దుగూకి చీకటి కమ్ముకుంటూంది. చీకటిపడ్డకొద్ది గోపీకి భయమెక్కువైంది. అట్లాగే నెమ్మదిగా చెట్టుదిగి అడుగులోఅడుగు వేసుకుంటూ అక్కయ్యగారింటికి బయలుదేరాడు. ఇంటికివచ్చి చూసేసరికి బజారు అరుగుమీద మోహాను గోపీ కోసము యెదురుచూస్తూ వుండడము కనిపించింది. గోపీ యికఉండబట్టలేక ఒకఉరుకున మోహాన్ను "యిక ఎప్పుడూ నిన్నుకొట్టనురా!" అంటూ కౌగలించుకున్నాడు, పశ్చాత్తాపంతో!

★

## ౪

# దైన్య జీవి

రేవతి బస్సు స్టాండువద్ద నిలబడి బస్సుకోసము ఎదురు చూస్తోంది. "అమ్మా! నీకాళ్లుమొక్కుతా! నీ బానిసను! ఒక పైసా వెయ్యమ్మా" అంటూ ఒక బిచ్చగత్తె అరుపువినిపించి ప్రక్కకు తిరిగింది. చింకి గుడ్డలమధ్య శరీరము ధగధగా మెరుస్తోంది. ప్రక్కన నిలబడి వున్న ఒకఅయన "యిట్లా అడుక్కుతినకపోతే ఏదైనా చాకిరీ చేసుకోరాదూ" అంటూ విసుకుకున్నాడు. రేవతికి మనస్సు ద్రవించింది. పక్కకు పిలచి "నీపేరేమిటి! ఏవూరునీది." అని నెమ్మదిగా అడిగింది. "నాపేరా! చంప అని పిలచేవారు. కాని యిప్పుడు ఏపేరూలేదు" అని ఏదో జ్ఞాపకము వచ్చినట్లుంది. కళ్ళవెంబడి నీరు రేవతి చూడకుండా బుర్ర తిప్పేసుకుంది చంప. నువ్వేమీ అనుకోకుండా వుంటే ఒకమాట చెబుతాను. ఏమీ అనుకోకు. అంటూ బస్సులో చంపను బలవంతాన ఎక్కించి తనుకూడా ఎక్కింది రేవతి.

రేవతి ఒకరూములో ఉంటూ కాలేజీలో బి.ఏ. చదువుతోంది. చంపను తీసుకుని రూముకు వచ్చింది రేవతి. శుభ్రంగా స్నానముచేయించి మంచిగుడ్డలు కట్టుకోమని కేరియరు భోజనము యిద్దరూ పంచుకుని తిన్నారు. అలసిపోయి ఉన్నదేమో చంప పండుకోగానే నిద్రపోయింది.

చంప కళ్ళు తెరచి చూచేసరికి గడియారం 3 గంటలు కొట్టింది. ఇక్కడ ఎందుకువున్నానా అని ఆశ్చర్యపోయింది. ఆలోచింపసాగింది, లీలగా జరిగిన సంగతులు ఒక్కొక్కటే

జ్ఞాపకము రా నారంభించినాయి. గభాలున లేచి రేవతి రెండు చేతులూ పుచ్చుకుని "యీ దీనురాలిమీద మీకింత దయ యెందుకు" అంటూ కంట నీరు రేవతికి కనుబడుతుం దేమోనని మొఖం పక్కకు తిప్పేసుకుంది. "ఊరికే బాధపడితే లాభ మేముంది. అసలు నీసంగతి ఏమిటో అంతా వివరంగా చెప్పితే నాశక్తి లోపములేకుండా నీకు సాయపడుతాను." అని తేల్చి చెప్పతలుచుకున్నది, చెప్పేసింది రేవతి. చంప కాసేపు స్తబ్దుగా కూర్చుంది. చివరకు యిలా మొదలు పెట్టింది.

"మానాన్నగారు చాలా ఆస్థిపరులు. కాని నేను కడుపున పడటమే వారి దారిద్ర్యానికి నాంది అని చెప్పవచ్చు. ఆస్థిపున్నవారు కాబట్టి క్రమంగా దుర్వ్యసనానికి దాసు లయ్యారు మానాన్నగారు. హారతికర్పూరములాగా నానాటికీ ఉన్న ఆస్తి సన్నగిల్లి పోసాగింది. కాని ఆయన అలవాటులు ఆయన మానలేదు. చివరకు నేను పుట్టినాక ఆకాస్తా మంగళం అయింది. ఇక మిగిలివున్నవి మాఅమ్మ వొంటిన వున్న నగ లేగా! నా అయిదోఏట మాఅమ్మ సొమ్ములంతా తీసుకుని వచ్చిన డబ్బుకి అమ్మేసి బాగా త్రప్పత్రాగి పోలీసుస్టేషనులోకి వెళ్లి అందులో ఒక కానిస్టేబుల్ని చితుకదన్నాడు. ఇంకే ముంది ? వెంటనే మానాన్న చేతులకు బేడీలు తగిలించారు. మాఅమ్మ యెంత మొత్తుకున్నా లాభములేకపోయింది. ఏం చేస్తాము. ఆదెబ్బలు తగిలిన కానిస్టేబులు చనిపోయాడు. అందుకని మా నాన్నగారిని..." యిక చెప్పలేక, వెక్కి వెక్కి ఏడ్వసాగింది. కొంత తమాయించుకుని. ఆరోజు మొదలు

నాకు సర్వస్వము మాఅమ్మే! నేను బాధపడితే చూడలేక పోయేది. ఇలా నెమ్మదిగా రోజులు దొర్లిపోతే యింకేమి అనుకునేది మాఅమ్మ. ఒక ధనవంతుల యింట్లో వంటదానిగా కుదిరించింది. నెలకు ముప్ఫయిరూపాయల జీతములో ఉన్న దానిలోనే వెనుక వేస్తూ మంచి గుడ్డలు అమర్చేది. స్కూలుకు పంపి చదువుచెప్పించింది. ఇంతకన్నా బాగు పడుదామని మాకులేదు. నేను థర్డుఫారములోకి వచ్చాను. ఇలా రోజులుగడుస్తూండగా మా అమ్మ మంచముమీదనుండి లేవలేదు. ఏమీ జ్వరముకూడా లేదు. మా ప్రక్క యింటి పిన్నిగారిని పిలుచుకువచ్చాను. ఆవిడ మా అమ్మనుచూచి "ఎంత దురదృష్టవంతురాలివే!" అంటూ నన్ను వాటేసుకు కళ్ళనీళ్ళు నింపింది. అప్పుడు అర్థమయింది నాకు మా అమ్మ కూడా నాకు దూరమైందని. ఇరుగుపొరుగువారు మా అమ్మను తీసుకువెళ్ళారు. అప్పటికి నాకు పన్నెండుఏండ్లు. డబ్బులేక చదువు మానెయ్యవలసి వచ్చింది. ఎవరితో చెప్పు కుందామన్నా వీలులేదు. కనికరించే దాతలులేరు, దయతలచే దయామయులులేరు. ఇక ఏమీ చెయ్యలేక యిలా అంటూ యిక చెప్పలేక రేవతి ఒళ్ళో మొగముదాచుకుంది చంప. రేవతి ఇకనుండి నీకేమీ భయంలేదు. నాకూ అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములూ యెవరూ లేరు. ఇద్దరమూ బ్రతికివున్నన్ని దినాలూ ఒకరి నొకరము ఎడబాయకుండా వుందా మంటూ దగ్గరకు తీసుకుని ఓదార్చింది రేవతి. అంత చిన్నతనములోనే యిన్ని కష్టాలకి నిష్ఠూరములకు గురి అయిన చంపను ప్రాణము లాగా చూచుకుంటూ వుంటూ వున్నారు వారిద్దరూ యీనాటికీ!

దాన్ని; అత్తింట్లో తప్ప పుట్టింట్లో వుండడము యిష్టములేదు. అట్లాగే మొత్తపట్టుకొని మూడురోజులు నిలుచున్నాను. మూడోనాడు మావారు భోంచేసి, దుస్తులు తొడుగుకొని కోర్టుకు వెళ్ళడమునకు తలుపుతీసారు. నేను అమాంతము ఆయన కాళ్ళమీదబడి "మీ యింట్లో వంటచేస్తాను. ఇంత పిండం పడవెయ్యండి" అని బ్రతిమిలాడుకున్నాను. ఆయన దయతలచి సరేనన్నారు. అట్లాగే వండిపెడుతూ కాలము గడుపుతున్నాను. చిన్నప్పటి రోజులూ ఇప్పటి రోజులూ తలుచుకొని కుమిలేదాన్ని. ఇట్లా యెడతెగకుండా కన్నీరు కార్చడమువల్ల అదివరకు కొద్దిగా కనపడే కళ్ళు అసలు కనపడకుండా పోయినాయి ఇట్లా కొన్నాళ్ళు గడిచినాయి.

3

ఒకరోజు మావారు "పెళ్ళిచేసుకోవాలి. ఖర్చుకు 6 వేలు రూపాయిలు కావాలి. మీ అమ్మనడిగి పట్టుకురా" అని రైలెక్కించి పుట్టింటికి పంపారు. మా అమ్మ నన్నుచూచి బోరున యేడవడము మొదలు పెట్టింది. అన్నలు కంట తడి పెట్టారు. నాకు ఏడుపు ఆగలేదు. మా అన్నయ్య "బుద్ధిలేని వెధవ, డబ్బు యిమ్మంటే మాత్రం మేము యిస్తామా? మాకేం స్థితికి తక్కువలేదు, నువ్వు మాతోపాటే వుండుపుగాని, నువ్వు అక్కడికి వెళ్ళవద్దు" అని గట్టిగా అన్నాడు. అప్పటికి వూరుకుని వాళ్లు వెళ్ళిపోగానే మా అమ్మను డబ్బుకు పోరు పెట్టి, తీసికొని బయలుదేరి వెళ్ళిపోయి ఆయనకిచ్చాను.

ఆయన నన్ను సంతోషముతో పొగిడారు. వివాహము చేసుకొని సుఖంగా వున్నారు. వారిద్దరూ చిలుకా గోరింకల్లాగా సుఖంగా వుంటున్నారు. మరి నేనో! కట్టుకోడానికి చీరలేక పాత చీరెలతో, సుఖములేకుండా వాళ్ళకి వంటచేసి పెడుతూ, నా చిన్నప్పటి ఆనందపు రోజులు తలుచుకుంటూ రోజులు నెట్టుతున్నాను. స్త్రీకి పుట్టినిల్లు స్థిరముకాదను విశ్వాసంతో. భగవంతుడు నాకు చెయ్యని నేరానికి వెయ్యరాని శిక్ష వేశాడు.

మరి నాగతి యింతేనా?........"

[మాతృసేవ అనే వారపత్రికలో ప్రచురణ పొందింది.]

★

౬

# పంపు దగ్గర గలాటా

ఎండా కాలమూ, వానా కాలమూ అని లేకుండా నీటి కరువువల్ల చాలా బాధపడేవాళ్ళము. ఒక్కొక్క మ్యునిసిపాలిటీ పంపుదగ్గరా దాదాపు 100 బిందె లుండేవి. ఇందులో దొరికినవారికి 3, 4 బిందెలు దొరకేవి. లేనివాళ్ళకు అసలే లేవు. సమయం మధ్యాహ్నం 12½ గంటలకు పంపు దగ్గర పద్మ, లలిత, సరోజిని, పనిమనిషి, వెంకమ్మ, వీరమ్మా, లక్ష్మిందేవి, పేరిందేవి హాజరు అయ్యేవారు.

పే : ఎంకమ్మా, చూశావా! ఆ లక్ష్మిందేవి కెంత పొగరో! మనం చూస్తూవుండగానే ఎన్ని బిందెలు పట్టిందో? అందరూ తల వక బిందా పట్టుకోవాలే అనే జ్ఞానం ఉందేమో చూడు.

ల : మునిసిపాలిటీ వారు ససేమిరా పెట్టించం పంపంటే, మా అమ్మ స్వంతఖర్చుతో వేయించిన పంపు ఒకటి కాదు 10 పట్టుకుంటా నన్నేం చేస్తావో చెయ్యి చూద్దాం?

స : లక్ష్మిందేవమ్మగారూ, పిల్లలు అన్నానికి కూర్చున్నారు. నీళ్ళులేకుండా. దయచేసి ఒక్క బిందెడు నీళ్ళు పట్టుకోనియ్యండి. మీకు పుణ్యాం ఉంటుంది.

ల : మా నీళ్ళు కానియ్యావమ్మా! నే వెళ్ళి పోయినాక నీ యిష్టంవచ్చినట్లు పట్టుకుందువు గాని!

పని : ఏం పేరిందేవమ్మగారూ! వాళ్ళు కడుపులునిండేదాకా గుంజుకు చచ్చినా మనకి ఒక బిందె అయినా యిస్తారూ?

పనిది : ఇక ఈమైన బిందె పట్టుకుంటా. మాకు నలుగురికి నాలుగు బిందులు యిచ్చినాక మీ యిష్టంవచ్చినంత సేపు పట్టుకోండి.

ల : ఏదీ మళ్ళీ వాగు చూద్దాం! నీకు బొత్తిగా మట్టూ మర్యాదా తెలియకుండా కళ్ళు నెత్తి కెక్కినయ్యే! అస లియ్యాను ఇట్లా జబర్దస్తీ చేస్తే! మా అన్నయ్యతో చెపుతా వుండు – నీ దాష్టీకం.

స : దయచేసి పిల్లలు లబలబ లాడుతున్నారు మంచి నీళ్ళకోసం, ఒక బిందెడు యియ్యండి. ఆ తరువాత మీ యిష్టం వచ్చినట్లు వాదులాడుకోండి. పంపు పోయే వేళకూడ అవుతోంది.

ల : సరే పట్టుకోవమ్మా నే వద్దన్నానా? (అని సరోజిని బిందెని పంపు ముందుకు నెట్టుతుంది.)

వీ : ఇందాకటినుండి చూస్తున్నాను. మీరు మీరు పట్టుకోవడమేగాని వెనుకవాళ్ళ కిద్దామని లేదేం మీకు. (అని పైకిచూచి) ఓ అమ్మగారు మీరేవచ్చి పట్టుకోండి, నావల్ల గాదు.

నాం : (గబాగబా క్రిందికి దిగివచ్చి) ఏమర్రా ఇందాక నుంచి చూస్తున్నాను. మా పని చేసేదానికి ఒక బిందైనా యిస్తారేమోనని! లేవండి (అని సరోజిని బిందె యివతలికి లాగి తన బిందె పెడుతుంది.)

స : అదేమిటండి పిన్నిగారూ! ఇంతకన్నా అన్యాయం ఏమైనావుందా? బిందెని లాగేస్తా రెందుకూ? పాపమని ఆమె

నన్ను ఒక బిందెపట్టుకోనుంటే బాగానేవుంది ఈ వరస. త్రాగడానికి కూడా గుక్కెడు మంచినీళ్ళు యివ్వకపోతే ఎట్లా గండి. పోనీ మీరన్నా పట్టియివ్వండి. (అని ప్రాధేయపడు తుంది. నాంచారమ్మ సరోజినికి పట్టియిస్తుంది. ఇదిచూచి అంతా బిందెలు పట్టమని గోలచేస్తారు.)

నాం : ఇదెక్కడి మాయదారి గోలమ్మా! నా బిందెలు మూడు నేను పట్టుకువెళ్ళిపోతాను. అని తనవొంతు తను పట్టుకువెళ్లుతుంది. నుంచున్నవాళ్ళందరూ పంపుకి ఎగబడతారు.

లలి : వానలుకురిసి బావులు నిండవలసిన భాద్రపద మాసంలోనే ఇట్లా అగచాట్లగా వుందే నీళ్ళకు! ఇక ఎండా కాలం ఎట్లాగో! బజారుకు మూడుపంపుల చొప్పున వేస్తా యని ఇప్పటికీ మూడేళ్లనుంచి గోలగా చెప్పుకుంటున్నారు. నిజమేనా అండి ?

ల : వల్లకాటి దిబ్బ. ఈ గుంటూరుమీద గంగాభవా నికి కోపంవచ్చి పాతాళంలోకి చొచ్చుకపోయింది. అందుకనే మనమంతా అగచాట్లు పడుతున్నాం నీళ్ళకు.

ప : చూశావా లలితా! మనం మాట్లాడుకుంటూంటే అంతా చూడు ఎట్లా పట్టుకుపోతున్నారో నీళ్ళు! ఏమండోయి! మా యిద్దరికి గూడా తలా వకబిందె పట్టియివ్వండి. మీ మేలు మరచిపోము.

(ఇంతలో గుడ్డలకొట్టు యజమాని భార్య రంగమ్మ బిందె తీసుకొని ప్రత్యక్షం అవుతుంది.)

సాం : చూశావా! పోనీ నీళ్ళు పట్టేయిస్తున్నాంగదా అని మంచి గుడ్డలు కొట్లోకొస్తే చెప్పనన్నా చెప్పదు. పోండి, మీకు నీళ్ళే యివ్వము.

రం : పోనీ యివ్వకపోతే! మీరే పట్టుకోండి. సరే యింకేం పట్టుకుంటాను. పంపే పోయింది. (అని వెళ్ళిపోతుంది.)

["ఆంధ్రప్రభ"లో ప్రచురణ పొందింది.]

★

వెల్‌కం ప్రెస్ :: గుంటూరు–2.

# శ్రీ పిల్లలమఱ్ఱి వారి కృతులు

★

| | | |
|---|---|---|
| * రాగ రేఖలు | 1- 0-0 | గేయములు |
| మధు కణములు | ... | ,, |
| కళాశ్రీలు | ... | ,, |
| * వత్సల | 0- 8-0 | నాటిక |
| చిత్ర | ... | ,, |
| మాలిని | ... | ,, |
| దీపకళిక | | ,, |
| అంబరీష | ... | ,, |
| పద్మ బాణము | ... | ,, |
| * ధూప దీపాలు | 1- 0-0 | కథలు |
| వెలుగు నీడలు | ... | ,, |
| పూల బాటలు | ... | ,, |
| * పూజా పుష్పాలు | 0-12-0 | ప్రసంగాలు-కథలు |
| * ఇష్టాగోష్ఠి | 1- 0-0 | ప్రసంగాలు |
| సాహిత్య వేదిక | ... | ,, |
| * సాహిత్య సంపద | 2- 8-0 | పుస్తోదయ సమీక్ష |
| * సాహిత్య సమీక్ష | 1-12-0 | ఉపన్యాసాలు |
| * సాహిత్య సమాలోచనము | 3- 0-0 | వ్యాసములు |
| శారదా విలాసము | ... | ప్రసంగ వ్యాసములు |
| * మాధురీ మహిమ | 2- 0-0 | వ్యాసములు |
| * విద్యార్థి పారిజాతము | 1- 8-0 | లక్షణ గ్రంథము |
| వ్యాకరణ దీపిక | ... | వ్యాకృతి |
| కావ్యాలోకనము | ... | గ్రంథ సమీక్ష |
| రసగుళికలు | ... | పద్య వ్యాఖ్యలు |
| మహోదయులు | ... | జీవిత చిత్రాలు |
| విష జ్వాలలు | ... | నవల |
| మన సాహిత్యము | ... | చరిత్ర |

* సిద్ధముగానున్నవి.

★

**శ్రీ పిల్లలమఱ్ఱి : శారదాపీఠము : గుంటూరు-2**